

శివలింగానికి పూజలు చేస్తున్న పండితుడు

ప్రశాంతి నిలయంలో యజ్ఞం

12 రోజులు కొనసాగనున్న అతిరుద్ర మహాయజ్ఞం

పుట్టపర్తి, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): లోక సంరక్షణ, విశ్వశాంతికోసం స్థానిక ప్రశాంతినిలయంలో శుక్రవారం అతిరుద్ర మహాయజ్ఞాన్ని ప్రారంభించారు. సాయికుల్వంతు సభామండపంలో ఉదయం 6 గంటలకు సత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ జ్యోతి వెలిగించి యజ్ఞాన్ని ప్రారంభించారు. శ్రీసత్యసాయి సేవాసంస్థల ఆధ్వర్యంలో యజ్ఞాన్ని నిర్వహించారు. మొదట విద్యార్థులు వేదపఠనం నిర్వహించారు. ప్రధాన అర్చకులు శ్రీనివాసన్ ఆధ్వర్యంలో వేద పండితులు గణపతిపూజతో యజ్ఞాన్ని ప్రారంభించి శివలింగానికి రుద్రాభిషేకం చేశారు. స్వస్తి వచనం, మహా సంకల్పం, గ్రహప్రీతి, మంటపాది పూజ, వాస్తుపూజను నిర్వహించారు. 11హోమాలతో యజ్ఞాన్ని నిర్వహిస్తున్నారు. 12 రోజుల పాటు యజ్ఞాన్ని నిరంతరాయంగా కొనసాగించి ఈనెల 25న పూర్ణాహుతితో ముగించనున్నారు. ప్రశాంతి నిలయంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన శివుడి విగ్రహానికి సత్య సాయి సేవాసంస్థల జాతీయ అధ్యక్షుడు నిమీష్‌పాండే, ఆర్‌జే రత్నాకర్‌లు పూజలు చేసి అలంకరించారు. ఈ యజ్ఞంలో వేలాది మంది భక్తులు పాల్గొన్నారు.



యజ్ఞం చేస్తున్న పండితులు



శివుడి విగ్రహానికి పూలమాల వేస్తున్న రత్నాకర్, నిమీష్‌పాండే

అడవికి కొరివి

నిప్పు పెడుతున్న ఆకతాయిలు

జిల్లాలో ఉన్న చిట్టడవులు వేసవి రాకమునుపే అగ్నికి ఆహుతి అవుతున్నాయి. కొండ, కోనలు కాలిపోవడంతో అందులో ఉండే వన్యప్రాణుల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతోంది. తాజాగా జిల్లా కేంద్రం సమీపంలోని జానకాంపల్లి, బుక్కపట్నం, పెనుకొండ ప్రాంతాల్లో అటవీ ప్రాంతంలో మంటలు చెలరేగడంతో అటవీశాఖ అధికారులు పరుగులు పెట్టాల్సి వచ్చింది. గత మూడేళ్లుగా ఓ మాదిరి వర్షాలతో కాస్తోకూస్తో విస్తరిస్తున్న అటవీ సంపద కొందరు స్వార్థపరులు, ఆకతాయిలు దెబ్బకు అగ్నికి ఆహుతైపోతోంది. అటవీ అభివృద్ధి, సంరక్షణ కోసం సాంకేతికత పెంపొందినా అటవీ వృక్షసంపద, వన్యప్రాణులను సంరక్షణ చేయలేని స్థితిలో అటవీశాఖ ఉందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. గత ఐదేళ్లలో అటవీశాఖకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అరకొర నిధులు కేటాయించడంతో అటవీ సంపద సంరక్షణకు చర్యలు తీసుకోలేకపోతున్నట్లు సంబంధిత అధికారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

\- ఆంధ్రజ్యోతి, పుట్టపర్తి

- బుగ్గి అవుతున్న వృక్షజాతులు, వన్యప్రాణులు
- కళ్లెదుటే కాలుతున్నా.. కానరాని సంరక్షణ చర్యలు
- నిధుల కేటాయింపు లేక చేతులెత్తేసిన అటవీశాఖ
- శాటిలైట్ ఫైర్ అలర్ట్ ఉన్నా ఆగని కార్చిచ్చు

జిల్లాలో బుక్కపట్నం, పెనుకొండ, కదిరి ఫారెస్ట్ రేంజ్ పరిధిలో దాదాపుగా 1.25 లక్షల హెక్టార్ల విస్తీర్ణంలో చిట్టడవులు విస్తరించి ఉన్నాయి. ఇందులో విలువైన వృక్ష జాతులు, చిరుత పులులు, ఎలుగుబంట్లు, జింకలు, కొండచిలువలు, నెమళ్లు, దుప్పులు, కుందేళ్లు, అడవికోతులు, అడవిపందులతో పాటు పలు రకాల వన్యప్రాణాలు వేల సంఖ్యలో జీవిస్తున్నాయి. ఇందులో బుక్క పట్నం, పెనుకొండ రేంజ్ పరిధిలోనే అరుదైన వృక్షసంపదతో పాటు వన్య ప్రాణులు అత్యధికంగా ఉన్నాయి. ప్రతి ఏటా జనవరి మాసం నుంచి సంభవించే అగ్ని ప్రమాదాలతో వృక్ష జాతులతోపాటు పచ్చదనం తరిగిపోతోంది. దీంతో జంతువులకు ఆహార కొరత ఏర్పడుతోంది. ముఖ్యంగా నేలపై పాకే వన్యప్రాణులు ప్రాణాలు కోల్పోతున్నాయి. వేసవి వచ్చిందంటే చాలు అడవుల్లో అగ్ని కీలలు ఎగసి పడుతుండటంతో వన్యప్రాణులు ప్రాణ భయంతో జనవాసాల్లోకి వస్తున్నాయి. ఈక్రమంలో రోడ్డుప్రమాదాలు, జనం దాడి చేసిన ఘటనల్లో ప్రాణాలు కోల్పోతున్నాయి.

● వృక్షజాతులు, వన్యప్రాణులకు ముప్పు





మల్లప్ప కొండల్లో అగ్ని కీలలు

శాటిలైట్ ఫైర్ అలర్ట్ ఉన్నా....

అగ్ని బారి నుంచి అడవిని రక్షించుకునేందుకు (ఏపీఎఫ్ఎంఐఎస్) శాటిలైట్ ద్వారా ఫైర్ అలర్ట్ సిస్టమ్ కొన్నేళ్లుగా అందుబాటులోకి వచ్చింది. అటవీ ప్రాంతాల్లో అగ్నికీలలు గుర్తించి వెంటనే ఆయా రేంజ్ పరిధిలోని అటవీశాఖ అధికారులు సమాచారం ఇస్తున్నారు. అయినా కార్చిచ్చును ఆర్పలేకపోతున్నారు. జిల్లా అటవీ శాఖకు క్షేత్ర స్థాయిలో 104 మంది సిబ్బంది ఉండాల్సి ఉండగా 55 మంది మాత్రమే ఉన్నారు. అసిస్టెంట్ బీట్ అధికారుల కొరత వలన విశాలమైన అటవీ ప్రాంతాల్లో పర్యవేక్షణ చేయలేని పరిస్థితి నెలకొంది. ఇటీవల కేంద్రం ఐఎఫ్ఎం కింద ఇచ్చే నిధులతోపాటు రాష్ట్ర ప్రభుత్వం క్యాంపా నిధులు కేటాయింపులు లేకుండాపోయాయి. జిల్లాలో అగ్ని ప్రమాదాల నివారణకు కేవలం రూ.11.75 లక్షల మాత్రమే నిధులు కేటాయించారు. వేసవి కాలం సమీపిస్తున్నా నయా పైసా నిధులు ఇవ్వకపోవడంతో జిల్లాలోని అన్ని రేంజ్ పరిధుల్లో అటవీశాఖ ఫైర్‌లైన్స్ పనులే మొదలు పెట్టలేని పరిస్థితి నెలకొంది. క్షేత్ర స్థాయిలో అటవీ శాఖ పర్యవేక్షణ కొరవడటంతో పచ్చని చెట్లకు నిప్పుపెడుతున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవడంలో విఫలమవుతున్నారనే విమర్శలున్నాయి. మరోవైపు అటవీ పరిసర గ్రామాల్లో వన సంరక్షణ సమితులున్నా ఏమాత్రం ఫలితం ఇవ్వ లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. వన్యప్రాణుల సంరక్షణ కోసం అటవీ శాఖ నీటి తొట్టెలు, క్యాటల్‌లిక్స్ బ్రిక్స్ రహదారుల్లో హెచ్చరిక బోర్డుల ఏర్పాటు కూడా నామమాత్రంగా కనిపిస్తున్నాయి.



అటవీ ప్రాంతంలో సిబ్బంది మాక్‌డ్రిల్ (ఫైల్)

ఇవీ కారణాలు

ప్రతి ఏటా జిల్లాలోని అటవీప్రాంతం, కొండల్లో ఫిబ్రవరి మొదలు మార్చి 15లోగా అగ్గి రాజుకుంటున్నట్లు అటవీ శాఖ చెబుతోంది. జిల్లాలో 368 అటవీ గ్రామాలు, అటవీ ప్రాంతాల సమీపంలో వ్యవసాయ పంటలు సాగు చేసే 1929 మంది రైతులు, 60 ఆలయాలు, 72860 మేకలు, గొర్రెలు, 746 పశువుల కాపర్లు ఉన్నట్లు అటవీ శాఖ గుర్తించారు. అటవీ ప్రాంతాల్లో అగ్ని ప్రమాదాలు జరగకుండా అటవీ సంరక్షణ అవగాహన సదస్సులు అటవీ శాఖ నిర్వహిస్తోంది. అయినా ప్రతి ఏటా అడవి, కొండ ప్రాంతాలు అగ్నిబారిన పడుతున్నాయి. అటవీ ప్రాంతాన్ని కాలిస్తే ఎండు గడ్డి కాలిపోయి త్వరగా పచ్చగడ్డి మొలకెత్తుతుందనే అపోహతో కొందరు జీవాల కాపర్లు నిప్పు పెడుతున్నారు. కొందరు ఆకతాయిలు, అటవీ ప్రాంతాలో ప్రయాణించే కొందరు బీడీ కాల్చి, ఆర్పకుండానే పడేస్తున్నారు. అటవీ ప్రాంతాల్లో వ్యవసాయ పొలాల వద్ద పంట వ్యర్థాలను కాల్చడం వల్ల కూడా అడవులకు మంటలు వ్యాపిస్తున్నాయి. గత ఏడాది పెనుకొండ, సోమందేపల్లి, మడకశిర, చిలమత్తూరు ఎర్రకొండ, చెలివెందుల, చంద్రాయునిపల్లి, బుచ్చయ్యగారి పల్లి, ఎద్దులకొండ, నల్లకొండ, కర్ణాటక నాగేపల్లి కొండలతోపాటు అటవీ ప్రాంతల్లో కార్చిచ్చుతో అటవీ సంపదతోపాటు వేలాది వన్యప్రాణులు మృత్యువాత పడ్డాయి. తాజాగా జిల్లాలో పలు చోట్ల అటవీ ప్రాంతం అగ్నికి ఆహుతి అవుతోంది.

ప్రత్యేక చర్యలు



అటవీ సంరక్షణ కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. జిల్లాలోని అన్ని రేంజ్‌ల పరిధిలో 14 కిలోమీటర్ల అగ్నినిరోధక రేఖలను ఏర్పాటు చేశాం. వేసవిలో అడవి అగ్నిబారిన పడకుండా అటవీ ప్రాంతంలోని గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నాం. అత్యధిక అటవీ ప్రాంతం గడ్డితో నిండి ఉంది. ఎక్కడైనా అటవీ ప్రాంతాల్లో నిప్పుపడినట్లు సమాచారం వచ్చిన వెంటనే మా సిబ్బంది వెళ్లి మంటలను ఆర్పే చర్యలు చేపడుతున్నారు. అటవీ ప్రాంతాల గ్రామాల ప్రజలు అటవీ సంపదను రక్షించుకోవడంతో తమ వంతు బాధ్యతగా మెలగాలి. వేసవిలో అడవికి నిప్పు పెట్టకుండా నిరంతరం నిఘా ఉంచాం.

\- చక్రపాణి, జిల్లా అటవీ శాఖ అధికారి

మొబైల్, టీవీలకు దూరంగా ఉండండి

• కలెక్టర్ టీఎస్ చేతన్



విద్యార్థులకు కంటి అద్దాలు అందజేస్తున్న కలెక్టర్

బుక్కపట్నం, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): భావిభారత పౌరులైన విద్యార్థులు టీవీ, మొబైల్ ఫోన్లకు దూరంగా ఉండాలని జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని బాలుర ఉన్నతపాఠశాలలో శుక్రవారం జాతీయ అంధత్వ నివారణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించి, లోపమున్నవారికి అద్దాలు పంపిణీ చేశారు. ఈకార్యక్రమాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఇళ్లలో టీవీలు, మొబైల్ ఫోన్లు చూడటం మానేయాలన్నారు. వీటి వలన దృష్టి లోపం కలుగుతోందని కలెక్టర్ పేర్కొన్నారు. తల్లిదండ్రులుకూడా పిల్లలపట్ల బాధ్యత తీసుకుని ఈపరికరాలను దూరంగా ఉంచాలని సూచించారు. చిన్నవయస్సులోనే దృష్టి లోపం కలిగితే భవిష్యత్‌లో పిల్లలు అనేక ఇబ్బందులు పడతారని చెప్పారు. స్థానిక ఉపాధ్యాయులు మాణిక్యం ఇసాక్, టీవీ, మొబైల్ వలన కలిగే ప్రభావాలను పాట ద్వారా విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి ఫిరోజ్ బేగం, డీఈఓ క్రిష్టప్ప, ఎంఈఓ గోపాల్‌నాయక్, వైద్యాధికారి సునిల్, పాఠశాల హెచ్ఎం జగదీష్, పీడీ నాగరాజు, ఉపాధ్యాయులు, వైద్యసిబ్బంది లింగా రామమోహన్, మురళి తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత వ్యక్తిత్వానికి నిదర్శనం.. సంజీవయ్య: జేసీ



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ అభిషేక్ కుమార్

పుట్టపర్తి టౌన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ఉన్నత వ్యక్తిత్వం, విలువలకు నిలువెత్తు నిదర్శనం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య అని జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ కొనియాడారు. జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పుట్టపర్తిలోని సాయి ఆరామం ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం సంజీవయ్య జయంతిని నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న జేసీ మాట్లాడుతూ.. సంజీవయ్య కేంద్ర మంత్రిగా ఉన్న సమయంలో దేశంలో కార్మిక, విద్యాశాఖలో పలు సంస్కరణలు రూపొందించి, బడుగు, బలహీన వర్గాలకు ఎన్నలేని సేవ చేశారని కొనియాడారు.



సంజీవయ్య చిత్రపటం వద్ద కలెక్టర్ నివాళి

● కలెక్టరేట్‌లో మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కలెక్టర్ టీఎస్ చేతన్, జేసీ అభిషేక్ కుమార్, డీఆర్ఓ విజయసారథి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు.

బాబా శత జయంతికి వేగంగా ఏర్పాట్లు : జేసీ

పుట్టపర్తిటౌన్, ఫిబ్రవరి14(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో ఈఏడాది నవంబరులో జరగ నున్న సత్యసాయి బాబా శతజయంతి ఉత్సవాలను విజయవంతం చేయడానికి ఏర్పాట్లు వేగవంతం చేయాలని జేసీ అభిషేక్‌కుమార్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ భవనంలో సత్యసాబాయిబా శతజయంతి ఉత్సవాల ముందస్తు ఏర్పాట్లపై సత్యసాయి ట్రస్టు ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులతో శుక్రవారం ఆయన సమీక్షించారు. బాబా శతజయంత వేడుకలకు దేశ, విదేశాల నుంచి పది లక్షల మంది భక్తులు పుట్టపర్తికి వచ్చే అవకాశముందన్నారు. వీరందరికి అవసరమైన వసతి, తాగునీరు, మరుదొడ్లు, రవాణా సౌకర్యం కల్పించడానికి అధికారులు ఏర్పాట్లు వేగవంతం చేయాలని సూచించారు. రోడ్ల మరమ్మతులు పూర్తి చేసి, డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచాలని ఆదేశించారు. కార్యక్రమంలో సత్యసాయి ట్రస్టు ప్రతినిధులు చలం, రోమల్, డీఎఫ్ఓ చక్రపాణి, విద్యుత్ ఎస్ఈ సురేంద్ర, డీఎస్పీ విజయకుమార్, ఆర్డీఓ సువర్ణ, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య పాల్గొన్నారు.

25 నుంచి లేపాక్షిలో ఉత్సవాలు



కరపత్రాలను విడుదల చేస్తున్న ఈఓ నరసింహమూర్తి

లేపాక్షి, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పర్యాటక కేంద్రం దుర్గా, వీరభద్ర, పాపనాశేశ్వరస్వారాలయంలో ఈనెల 25నుంచి మార్చి 1వరకు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈమేరకు ఉత్సవాలకు సంబంధించిన కరపత్రాలను ఆలయ ఈఓ నరసింహమూర్తి శుక్రవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదు రోజులు ఆలయంలో విశేష పూజలు జరుగుతాయన్నారు. దుర్గా వీరభద్రస్వాములను ప్రత్యేక ంగా అలంకరించి, భక్తులకు దర్శనం కలిగిస్తామన్నారు. ఇందుకోసం ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఆదినారాయణ, ఆలయ కమిటీ సభ్యులు అర్చకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

వాతావరణం దెబ్బ..!

- రబీలో అరకొరగా వేరుశనగ దిగుబడి
- నేల చూపులు చూస్తున్న ధర
- పెట్టుబడి కూడా రాదంటున్న రైతులు



కళ్లంలోని వేరుశనగ పంట

కొత్తచెరువు, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): అరకొర దిగుబడులతో వేరుశనగ రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ ఏడాది జిల్లా వ్యాప్తంగా రబీ సీజన్‌లో 19,306 హెక్టార్లల్లో రైతులు వేరుశనగ సాగుచేశారు. వాతావరణ మార్పులు, వరుస తుఫానులతో పంటకు తెగుళ్ల అధికంగా ఆశించాయి. ఎన్ని పురుగు మందులువాడినా ప్రయోజనం లేకపోయింది. ఈక్రమంలోనే దిగుబడి తగ్గిందని పలువురు రైతులు వాపోతున్నారు. పంట బాగా పండితే ఎకరాకు 45 కిలోల బస్తాలు 30కి పైగా అవుతాయి. ఈ ఏడాది కేవలం 15 నుంచి 20లోపే అవుతున్నట్లు రైతులు పేర్కొంటున్నారు. దిగుబడి అరకొరగా ఉన్న నేపథ్యంలో ధర కూడా నేలచూపులు చూస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో పెట్టుబడులు కూడా వచ్చే అవకాశాలు లేవని రైతులు అవేదన వ్యక్తం చేస్తున్నారు. క్వింటాల్ ధర రూ.5 వేల నుంచి రూ.6 వేల లోపే ఉందన్నారు. దీంతో నష్టాలు తప్పడంలేదని పలువురు అన్నదాతలు చెబుతున్నారు. ప్రభుత్వం స్పందించి వేరుశనగ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలని రైతు సంఘం నేతలు కోరుతున్నారు.

గత ఏడాదే మేలు



నాకు మూడు ఎకరాల పొలం ఉంది. ఇందులో గత ఏడాది కే-6 రకం వేరుశనగ సాగు చేశా. 45 కిలోల బస్తా రూ.3,450 ధర పలికింది. దీని ప్రకారం వేరుశనగ క్వింటాల్ ధర రూ.8 వేల నుంచి రూ.9 వేలు పలికింది. ఈ ఏడాది రబీ సీజన్‌లో తీవ్రమైన వాతావరణ మార్పులతో దిగుబడి బాగా తగ్గింది. అలాగే రేటు కూడా బాగా తగ్గింది. 45 కిలో బస్తా రూ.2,250గా ఉంది. ప్రస్తుతం క్వింటాల్ వేరుశనగ రూ.5,800 నుంచి రూ. 6,210 మించి ధర పలకడంలేదు. దీంతో వచ్చిన సొమ్మంతా పెట్టుబడికే సరిపోతోంది.

\-చక్రపాణి, రైతు, కొత్తచెరువు

ఎకరా సాగుకు రూ.30వేలు పైబడి ఖర్చు



ఒక ఎకరాలో వేరుశనగ సాగు చేయడానికి రూ.30వేలకు పైగానే ఖర్చు వస్తోంది. పంట బాగా పండితే ఎకరాకు 45 కిలోల ప్రకారం 30 నుంచి 40 సంచులు అవుతాయి. నాకు 10 ఎకరాల పొలం ఉంది. ఇందులో 5 ఎకరాల్లో వేరుశనగ సాగు చేశా. పంట సాగుకు రూ.1.5 లక్షలు పెట్టుబడి పెట్టా. అయితే తుఫాన్ ప్రభావంతో వేరుశనగ పంటకు తెగుళ్ల సోకడంతో దిగుబడి బాగా తగ్గింది. దీంతో ఎకరాకు 15 నుంచి 20 మూటలు అయ్యాయి. ధర కూడాలేక పోవడంతో పెట్టుబడి కూడా వచ్చేఅవకాశం లేదు.

\-ప్రసాద్, ఇరగంపల్లి

'స్వచ్ఛాంధ్ర'లో జిల్లాకు 19వ స్థానం

పుట్టపర్తి, ఫిబ్రవరి14(ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర మిషన్ లక్ష్యాల సాధనలో జిల్లాకు 19వ స్థానం దక్కింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర మిషన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా ప్రతినెలా మూడో శనివారం ప్రత్యేకంగా ఓ థీమ్ తీసుకుని ప్రజల్లో అవగాహన కల్పిస్తోంది. జనవరిలో కొత్త సంవత్సర క్లీన్ స్టార్ట్ అంశాన్ని థీమ్‌గా తీసుకున్నారు. స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్రలో భాగంగా పట్టణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖలు చేపట్టిన కార్యక్రమాలపై ప్రగతి నివేదికను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు అధికారులు వివరించారు. వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం, పబ్లిక్ టాయిలెట్స్, ఇంటింటా చెత్త సేకరణ, సాలిడ్ వేస్ట్ సెగ్రిగేషన్, సాలిడ్ వేస్ట్ మేనేజ్ మెంట్, కమ్యూనిటీ సోక్ పిట్స్, పరిశుభ్ర గ్రామం, ఓడీఎఫ్ ప్లస్ మోడల్ విలేజ్ వంటి అంశాల్లో ప్రగతి ఆధారంగా రాష్ట్రంలో జిల్లాలకు ర్యాంకులు ఇచ్చారు. రెండు శాఖల్లో 200 పాయింట్ల ఆధారంగా జిల్లాల ప్రోగ్రెస్‌పై ర్యాంకులు ఇచ్చారు. 105 పాయింట్లతో శ్రీసత్యసాయి జిల్లా 19వ స్థానంలో నిలిచింది.

బాల వసంతం



అనంత బాలోత్సవాలు ఆరంభం.. ఉత్సాహంగా చిన్నారుల ప్రదర్శన

(6లో....)

బాల వసంతం


పతాకాన్ని ఆవిష్కరిస్తున్న జేఎన్‌టీయూ వీసీ సుదర్శనరావు


పదండి పోదాం.. ప్రదర్శనలకు..






సూపర్.. సూపర్..


ఉండమ్మా.. తీర్చిదిద్దుతా..


ఆనంద బంధనం..


బాలోత్సవంలో ప్రసంగిస్తున్న డాక్టర్ గేయానంద్


పాల్గొన్న జనం

అనంత బాలోత్సవాలు ఆరంభం

శాస్త్రీయ, సాంస్కృతిక ప్రదర్శనలు

ఉత్సాహంగా తలపడిన బాలలు

అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): అనంత ఐదో బాలోత్సవాలు ఉత్సాహభరిత వాతావరణంలో శుక్రవారం ప్రారంభమయ్యాయి. నగరంలోని లలితకళా పరిషత్, గిల్డ్ ఆఫ్ సర్వీస్ స్కూల్‌లో ఐదు వేదికలపై చిన్నారులు అద్భుత ప్రదర్శనలతో అలరించారు. శాస్త్రీయ, జానపద నృత్య ప్రదర్శనలు, నాటకాలతో అబ్బురపరిచారు. సైన్స్ ఫేర్‌లో తమ ఆవిష్కరణలను ప్రదర్శించారు. వందలాది మంది చిన్నారులు, వారి తల్లిదండ్రులు, బంధుమిత్రులు, నగర ప్రముఖుల రాకతో సంబరాలలో సందడి కనిపించింది. జేఎన్‌టీయూ వీసీ ప్రొఫెసర్ సుదర్శనరావు, మాజీ ఎమ్మెల్సీ గేయానంద్‌లు ముఖ్య అతిథులుగా హాజరై, జాతీయ పతాకావిష్కరణ చేసి బాలోత్సవాలను ప్రారంభించారు.


పాటల పల్లకిలో..

మంచిని స్వీకరించాలి..

శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని చిన్నారులు మంచికి ఉపయోగించేలా తల్లిదండ్రులు శ్రద్ధ పెట్టాలని జేఎన్‌టీయూ వీసీ సుదర్శనరావు సూచించారు. ఇంటర్నెట్, మొబైల్ ఫోన్‌లు మంచితోపాటు చెడుకూ కారణమవుతున్నాయని అన్నారు. మంచిని మాత్రమే చిన్నారులు స్వీకరించేలా తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలని అన్నారు. విద్యార్థులు ప్రశ్నించే తత్వాన్ని అలవాటు చేసుకోవాలని అన్నారు. విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీసేందుకు ఏటా బాలోత్సవాలను నిర్వహించడం అభినందనీయమని అన్నారు.


నాటకంలో బాల కళాకారులు


నాట్యం చేస్తూ..



సృజన వెలుగులోకి..

చిన్నారులలో దాగిన సృజనాత్మకతను వెలుగులోకి తెచ్చేందుకు బాలోత్సవాల వంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని మాజీ ఎమ్మెల్సీ గేయానంద్ అన్నారు. బాలోత్సవాల్లో విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొనడం అభినందనీయమని అన్నారు. ప్రదర్శనల అనంతరం చిన్నారులకు ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలను అందించారు. కార్యక్రమంలో బాలోత్సవ కమిటీ అధ్యక్షురాలు షమీమ్ షఫివుల్లా, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు, కార్యనిర్వాహక కార్యదర్శి సావిత్రి, కోశాధికారి జిలాన్, న్యాయవాది రామకృష్ణారెడ్డి, కంబదూరి షేక్ నబీరసూల్, గిల్డ్ ఆఫ్ సర్వీస్ స్కూల్ అరుంధతి, ఇన్నర్ వీల్ క్లబ్ చైర్‌పర్సన్ జయంతి, మాజీ సైనికుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు షేకన్న, ఎల్‌కేపీ ప్రధాన కార్యదర్శి పద్మజ, సభ్యుడు రామగోవింద్ సాగర్, బాలోత్సవ కమిటీ సభ్యులు ఓతూరు పరమేష్, రమణయ్య, లింగమయ్య, గోవిందరాజులు, నాగేంద్ర, సరళ, దేవేంద్రమ్మ, ఏజీ రాజమోహన్ తదితరులు పాల్గొన్నారు.


ఎంత బావున్నారో..


బాల సైనికులు

పోటాపోటీగా..

జిల్లాలోని వివిధ ప్రాంతాల పాఠశాలల విద్యార్థులు బాలోత్సవాలలో భాగం పంచుకున్నారు. తమ ప్రతిభా పాటవాలను చాటేందుకు పోటీ పడ్డారు. మూడురోజులపాటు జరిగే బాలోత్సవాల ఆవరణకు 'కల్లూరు సుబ్బారావు ప్రాంగణం' అని పేరు పెట్టారు. ఒకటో వేదికకు నరసింహమూర్తి, గాజుల నారాయణస్వామి పేర్లు, రెండో వేదికకు జాకీర్ హుస్సేన్, మూడో వేదికకు షేక్ నాజర్, నాలుగో వేదికకు సీనియర్ పాత్రికేయుడు నందినేని దేవప్రసాద్, ఐదో వేదికకు మహిళా ఉద్యమ నాయకురాలు శకుంతలమ్మ పేర్లు పెట్టారు. మొదటి రోజు నిర్వహించిన పోటీలలో 1500 మంది విద్యార్థులు పాల్గొన్నారు. అకడమిక్ అంశాలలో వ్యాసరచన, కవిత, కథా రచన, క్విజ్, మెమోరీ టెస్ట్ తదితర పోటీలు నిర్వహించారు. సాంస్కృతిక అంశాలలో జానపదం, కూచిపూడి, భరతనాట్య ప్రదర్శనలు నిర్వహించారు.

మాతాశిశు మరణాల నివారణకు ఏఐ సాంకేతికత

రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీరపాండియన్


కూడేరు పీహెచ్‌సీలో జననీ మిత్ర యాప్ ప్రారంభం


అనూషకు ఇంటి వద్ద స్క్రీనింగ్ పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

కూడేరు, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): గర్భిణులు, బాలింతల్లో రక్తహీనత, మాతాశిశు మరణాలను నివారించేందుకు ఏఐ సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన జననీ మిత్ర యాప్‌ను రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీరపాండియన్ శుక్రవారం ప్రారంభించారు. మోడల్ పీహెచ్‌సీగా తీర్చిదిద్దేందుకు ఎంపిక చేసిన అనంతపురం జిల్లా కూడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన సందర్శించారు. కూడేరు మండలంలో తల్లీబిడ్డలకు సంబంధించి కొన్ని ప్రయోగాలు చేస్తున్నారని తెలిపారు. రక్తహీనత కారణంగా ప్రసూతి మరణాలు సంభవిస్తున్నాయని, వాటిని పూర్తిగా తగ్గించేందుకు జననీ మిత్ర యాప్ ఉపయోగపడుతుందని అన్నారు. అందులో గర్భిణులు తీసుకోవాల్సిన పౌష్టికాహారం, ఆరోగ్య పరిస్థితుల గురించి తెలుకోవచ్చునని అన్నారు. అనంతపురం జిల్లాలోని కూడేరు, పామిడి మండలాల్లో రక్తహీనత కేసులు ఎక్కువగా నమోదు అయ్యాయని తెలిపారు. అందుకే కూడేరును పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశామని తెలిపారు. అందుబాటులో ఉన్న డిజిటల్ సాంకేతిక వనరులను ఉపయోగించి.. రక్తహీనత, మతాశిశు మరణాలను నివారించడమే పైలెట్ ప్రాజెక్టు ప్రధాన ఉద్దేశమని తెలిపారు. జననీ మిత్ర యాప్‌ను రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేస్తామని, క్షేత్రస్థాయిలో వైద్యశాఖ సిబ్బంది బాధ్యతలు ఇచ్చామని తెలిపారు. స్వస్థి సంస్థతో కలిసి పనిచేస్తామని, ఆరు నెలల్లో మాతా శిశుమరణాల విషయంలో పెద్ద మార్పులు తీసుకు వస్తామని అన్నారు. బాలింతలకు యాప్‌లోని అంశాలపై అవగాహన కల్పిస్తారని తెలిపారు. అనంతరం క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షల విధానాన్ని పరిశీలించారు. వైద్యసేవలు, మందులు, ల్యాబ్ గురించి సిబ్బందితో మాట్లాడారు. కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్, అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న, డీఎంహెచ్‌ఓ ఈబీ దేవి, ప్రోగ్రాం ఆఫీసర్ యుగంధర్ పాల్గొన్నారు.

సమ్మెను జయప్రదం చేయండి

సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు


నిరవధిక సమ్మె కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 18 నుంచి చేపట్టనున్న నిరవధిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు పిలుపునిచ్చారు. జేవీవీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో నిరవధిక సమ్మె కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఓబులు మాట్లాడుతూ ప్రతిసారి సమ్మె చేస్తే తప్ప వేతనాలు అందుకునే పరిస్థితి లేదన్నారు. 10 నెలల వేతనాలు ఇవ్వకపోతే కుటుంబాల పోషణ ఎలా అని ప్రశ్నించారు. ఈ నేపథ్యంలోనే కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసం నిరవధిక సమ్మె చేపడుతున్నారన్నారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్, కార్యదర్శి రాము, నాగరాజు, వన్నూరుస్వామి, సోము, లోకేష్, మురళి, నాగేంద్ర, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు డాక్టర్లకు మెమో

ఓపీకి డుమ్మాకొట్టిన ఫలితం

అవుట్ సోర్సింగ్ ఉద్యోగి సస్పెన్షన్


ఆస్పత్రిలో విభాగాలను తనిఖీ చేస్తున్న డాక్టరు వెంకటేశ్వరరావు

అనంతపురంటౌన్, ఫిబ్రవరి14(ఆంధ్రజ్యోతి): జిల్లా సర్వజన ఆస్పత్రిలో విధుల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వైద్యులు, సిబ్బందిపై సూపరింటెండెంట్ డాక్టరు వెంకటేశ్వరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆస్పత్రిలోని పలు విభాగాలను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ఉదయం 10గంటలకు, మధ్యాహ్నం 2.45 గంటలకు పల్మనాలజీ, సైకియాట్రీ విభాగాలను తనిఖీ చేశారు. ఆ సమయంలో పల్మనాలజీ ఓపీలో డ్యూటీలో ఉండాల్సిన డాక్టరు సౌజన్యలక్ష్మి, సైకియాట్రీ ఓపీలో ఉండాల్సిన డాక్టరు అనిల్‌కుమార్ కనిపించలేదు. దీంతో ఆ ఇద్దరు డాక్టర్లకు మెమోలు జారీ చేశారు. అలాగే అనస్తీషియా విభాగంలో పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్ ఉద్యోగి చిన్నప్పయ్య అదే విభాగంలో పనిచేస్తున్న ఓ మహిళా సిబ్బంది పట్ల అసభ్యంగా వ్యవహరించినట్లు విచారణలో తేలడంతో ఆయనను సస్పెండ్ చేసినట్లు సూపరింటెండెంట్ తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్లు, సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. ఓపీలలో సంబంధిత డాక్టర్లు తప్పనిసరిగా ఉంటూ రోగులకు సేవలందించాలని ఆదేశించారు. ఇకనుంచి తనతో పాటు అడ్మినిస్ట్రేటర్, ఆర్ఎంఓలు ప్రతి రోజూ మూడుసార్లు ప్రతివిభాగాన్ని తనిఖీ చేయనున్నట్లు వెల్లడించారు. రెండుసార్లు చేసిన తప్పునే చేస్తే అలాంటి వారిపై కలెక్టరు, డీఎంఈలకు ఫిర్యాదు చేస్తామన్నారు. సీనియర్, జూనియర్ అసిస్టెంట్‌లు ప్రతి ఫైల్‌ను ఈఫైల్ విధానంలోనే పంపాలని, ఏ విభాగంలోనైనా రోగుల నుంచి డబ్బులు వసూలు చేసినట్లు తెలిస్తే శాఖాపరమైన చర్యలు ఉంటాయన్నారు.

విద్యార్థుల ఆరోగ్య సంరక్షణకు ప్రత్యేక చర్యలు

రాష్ట్రవ్యాప్తంగా 20లక్షల మందికి కంటి పరీక్షలు

వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్


విద్యార్థులకు కంటి అద్దాలు పంపిణీ చేస్తున్న మంత్రి సత్యకుమార్ యాదవ్

గార్లదిన్నె, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల ఆరోగ్య సంరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలకు శ్రీకారం చుట్టిందని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. మండలకేంద్రంలో శుక్రవారం కళ్లద్దాల పంపిణీ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. మంత్రి హాజరై విద్యార్థులకు కంటి అద్దాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంటి సమస్యలతో బాధపడుతున్న ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల కోసం ప్రధాని నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాలతో రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలల్లో కంటి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పరీక్షల ద్వారా అవసరమైన విద్యార్థులకు కంటి అద్దాలు అందజేస్తామన్నారు. తీవ్రమైన సమస్యలుంటే వారికి సర్జరీ చేసి మెరుగైన వైద్య సేవలందిస్తామని తెలిపారు.

నారా లోకేశ్ డైనమిక్ లీడర్

విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ డైనమిక్ లీడర్ అని సత్యకుమార్‌యాదవ్ ప్రశంసించారు. గత ప్రభుత్వంలో నాసిరకమైన ఆహారాన్ని మధ్యాహ్న భోజనంగా అందించారన్నారు. దీంతో విద్యార్థులు తరచూ అనారోగ్యానికి గురయ్యారు. ఈ సమ్యలను పరిష్కరించేందుకు లోకేశ్ మంత్రిగా బాధ్యతలు చేపట్టగానే పౌష్టికాహారాన్ని అందించేందుకు శ్రీకారం చుట్టారన్నారు. ఇంటర్మీడియేట్ వరకు పోషకాలతో కూడిన ఆహారాన్ని అందిస్తామన్నారు. స్కిల్స్ సెన్సెస్ చేసి భవిష్యత్తులో ఉద్యోగ, ఉపాధి పొందేలా చదువుతోపాటు నైపుణ్య శిక్షణ ఇచ్చేందుకు చర్యలు తీసుకున్నారని వివరించారు. శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేందుకు ప్రధాని నరేంద్రమోదీ ఆధ్వర్యంలో అటల్ టింకరింగ్ ల్యాబ్‌లను ఏర్పాటు చేసినట్లు వివరించారు. అనంతరం ఎమ్మెల్యే బండారు శ్రావణి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పాటు అయ్యాక విద్య, వైద్యానికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు ఉచిత కంటి అద్దాల పంపిణీ కార్యక్రమాన్ని శింగనమల నియోజకవర్గం గార్లదిన్నెలో మండలంలో ప్రారంభించడం ఎంతో సంతోషమన్నారు. అనంతరం రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీరపాండియన్ మాట్లాడుతూ విద్యార్థులకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి కంటి అద్దాలు పంపిణీ చేయడం ద్వారా చదువుతో పాటు భవిష్యత్ బాగుంటుందని తెలిపారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కంటి చూపులో లోపాలు ఉన్న విద్యార్థులకు ఇకమీదట ఆ సమస్య ఉండదన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈబీదేవి, డీఈఓ ప్రసాద్ బాబు, ఎంపీపీ వెంకటనారాయణ, వైస్ ఎంపీపీ కుంచం రామ్మోహన్‌రెడ్డి, తహసీల్దార్ బండారు ఈరమ్మ, మత్స్యశాఖ డీడీ శ్రీనివాస్‌నాయక్, ఎంఈఓలు తారా చంద్రానాయక్, మల్లికార్జున నాయక్, పాఠశాల ప్రిన్సిపాల్ సతీష్ పాల్గొన్నారు.

పురంలో అవినీతి పంచాయితీ

అనంతపురం సెంట్రల్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): పన్నుల శాఖ హిందూపురం సర్కిల్‌లో అవినీతి పంచాయితీ జరుగుతోంది. అక్కడ ఒక ఉన్నతాధికారి, డీసీటీఓ స్థాయి అధికారులు, సీనియర్ అసిస్టెంట్లు నాలుగు వర్గాలుగా విడిపోయినట్లు సమాచారం. జీరో వ్యాపారం చేసే కీలక డీలర్ల వద్దకు ఈ నాలుగువర్గాలు నెల మామూళ్లకోసం వెళుతున్నట్లు తెలిసింది. దీంతో అక్కడి డీలర్లు బెంబేలెత్తుతున్నారట. ఇదే క్రమంలో వర్గాలుగా ఏర్పడిన అధికారులు, సిబ్బంది నాలుగు రోజులుగా జాయింట్ కమిషనర్‌కు ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకుంటున్నట్లు తెలిసింది. ఈ అవినీతి పంచాయితీ నిగ్గు తేల్చేందుకు ఆ శాఖ రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులు ఒకరిని విచారణ అధికారిగా నియమించారు.

లేపాక్షి శిల్పకళ అద్భుతం

అఖిలభారత పంచాయతీ పరిషత్ చైర్‌పర్సన్ విశాలా ఈశ్వర్


విశాలా ఈశ్వర్‌ను సన్మానిస్తున్న పంచాయతీ సిబ్బంది

లేపాక్షి, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): ప్రపంచ ప్రసిద్ధిగాంచిన లేపాక్షి దుర్గా, వీరభద్రస్వామి ఆలయంలోని శిల్ప, చిత్రకళలు అద్భుతంగా ఉన్నాయని అఖిల భారత పంచాయతీ పరిషత్ చైర్‌పర్సన్ విశాలా ఈశ్వర్ అన్నారు. శుక్రవారం ఆలయాన్ని ఆమె సందర్శించారు. అర్చకులు.. ఆలయ చరిత్ర, విశేషాలను వివరించారు. అనంతరం దుర్గావీరభద్రస్వాములకు ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం విశాలా ఈశ్వర్‌ను సత్కరించారు.

అప్పు మీద తప్పు

అప్పులు తీర్చడానికే అంతం..?

సావిత్రమ్మ హత్యకేసు ఛేదన

పోలీసుల అదుపులో నిందితుడు



సావిత్రమ్మ (ఫైల్)

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): వ్యసనాలకు బానిసైన ఓ వ్యక్తి దొంగగా మారాడు. ఈక్రమంలో ఓ మహిళను సైతం హత్య చేశాడు. ఈనెలలో నగర శివారులో ఓ మహిళ హత్య జరిగింది. ఈ కేసులో కీలక నిందితుడిని నాలుగో పట్టణ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. పోలీసుల విచారణలో అతను అప్పుల నేపథ్యంలోనే ఈ హత్యకు పాల్పడినట్లు చెప్పుకొచ్చినట్లు తెలిసింది. యాసర్ అనే వ్యక్తి రూ.5లక్షల వరకు అప్పులు చేశాడు. రుణదాతల నుంచి ఒత్తిళ్లు అధికమయ్యాయి. ఈ క్రమంలో అతడి భార్య ఎలాగైనా సరే అప్పు తీర్చేయ్ అంది. దీంతో టీచర్స్ కాలనీలో ఒంటరిగా నివాసముంటున్న బొమ్మాళి సావిత్రమ్మ గొంతును కత్తితో కోసి హత్య చేశాడు. ఆమె మెడలోని ఐదుతులాల బంగారు గొలుసులను లాక్కెళ్లాడు. బంగారు నగలను తాకట్టు పెట్టే క్రమంలోనే పోలీసులు యాసర్‌ను అదుపులోకి తీసుకుని, వాటిని స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం.

పట్టపగలే..

నగర శివారులోని టీచర్స్‌కాలనీలో ఒంటరిగా నివాసముంటున్న బొమ్మాళి సావిత్రమ్మ(63)ను ఈనెల ఆరో తేదీ పట్టపగలే గొంతుకోసి హత్య చేశారు. మధ్యాహ్నం 1.30 నుంచి 4గంటల మధ్యలో ఈ హత్య జరిగింది. సావిత్రమ్మ భర్త ఓబులేసు అటవీశాఖలో పనిచేస్తూ రిటైర్డ్ అయ్యారు. కొన్నేళ్ల కిందటే ఆయన మృతి చెందారు. అప్పటి నుంచి ఆమె ఒంటరిగా ఉంటోంది. వారికి ఇద్దరు కుమారులు, కుమార్తె సంతానం. పెద్దకుమారుడు విజయ్‌కుమార్ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్. ఆయన ప్రస్తుతం తన కుటుంబంతో కోవూరునగర్‌లో నివాసముంటున్నాడు. రెండో కుమారుడు జయకుమార్, కుమార్తె పూర్ణిమ అమెరికాలో ఉంటున్నారు. పెద్ద కుమారుడు విజయ్‌కుమార్ ఆరో తేదీ మధ్యాహ్నం తన తల్లికి భోజనం క్యారియర్ ఇచ్చి వెళ్లాడు. సాయంత్రం 4.30గంటల సమయంలో ఇంట్లో పనులు చేయడానికి పనిమనిషి రమణమ్మ వచ్చింది. ఇంట్లో రక్తపు మడుగులో ఉన్న సావిత్రమ్మను చూసి ఆందోళనతో కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చింది. వారు నాలుగో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సావిత్రమ్మ గతంలో అంగన్‌వాడీ టీచర్‌గా పనిచేసినట్లు చెబుతున్నారు. 2015లో ఆమె ఉద్యోగానికి రాజీనామా చేసినట్లు సమాచారం.

మహిళపై కత్తితో దాడి


బాధితురాలిని ఆసుపత్రికి తీసుకెళ్తున్న మహిళా పోలీసు

పెనుకొండ టౌన్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): స్థానిక నారాయణమ్మ కాలనీలో నివాసముంటున్న బ్యూటీపార్లర్ నిర్వాహకురాలు శైలజపై గుర్తుతెలియని వ్యక్తి శుక్రవారం కత్తితో దాడి చేశాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన మేరకు... నారాయణమ్మ కాలనీలో శైలజ ఓ ఇంటిని అద్దెకు తీసుకుని నివాసం ఉంటున్నారు. అందులో పైపోర్షన్‌లో నివాసం ఉంటూ కింద పోర్షన్‌లో బ్యూటీపార్లర్ నిర్వహిస్తున్నారు. ఈమె భర్త శ్రీనివాసులు లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నారు. ఎప్పటిలాగే శుక్రవారం ఉదయం శైలజ నివాసం ఉంటున్న ఇంటికి గడియపెట్టి బ్యూటీపార్లర్‌ను తెరిచేందుకు కిందకు వచ్చారు. అనంతరం పై పోర్షన్‌కు వెళ్లారు. అప్పటికే గుర్తుతెలియని వ్యక్తి ఇంట్లో జొరబడి ఉన్నాడు. వాకిలి తీసి లోనికి వెళ్లేసరికి శైలజ గొంతును పట్టుకుని కిచెన్‌లోనే ఉన్న చాకుతో చేతివేళ్లపై దాడి చేశాడు. ఆమె కేకలు వేయడంతో కిందకు పరుగులు తీశాడు. స్థానికులు అతన్ని పట్టుకునేందుకు ప్రయత్నించినా తప్పించుకుని పారిపోయాడు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని సమీపంలోని సీసీకెమెరాలు పరిశీలించిన ప్రయోజనం లేకపోయింది. గుర్తుతెలియని వ్యక్తి టీషర్ట్, షార్ట్‌తో వచ్చినట్లు స్థానికులు తెలిపారు. గాయపడిన శైలజను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

నేడు మెగా జాబ్‌మేళా

మడకశిరటౌన్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మధుగిరి రోడ్డులో శనివారం ఉదయం మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే ఎంఎస్ రాజు తెలిపారు. పట్టణంలో ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. ఉదయం 9 గంటలకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మెగా జాబ్‌మేళా ప్రారంభమవుతుందన్నారు. సాయంత్రం 6 గంటల వరకు కొనసాగుతుందన్నారు. దాదాపు 50 కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం..కేసు

పుట్టపర్తిరూరల్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని బత్తలపల్లి గ్రామానికి చెందిన మహిళ అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్సై లింగన్న తెలిపారు. బత్తలపల్లి గ్రామానికి చెందిన వినోద్‌కుమార్ భార్య కావ్య ఈనెల 9న సాయంత్రం 6గంటలకు ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయినట్లు భర్త ఫిర్యాదు చేశాడన్నారు. ఆ మేరకు కేసునమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు. ఆమె అచూకీ తెలిసిన వారు 9440796839 నంబరులో సమాచారం ఇవ్వాలన్నారు.

మంటలు ఆర్పడానికి వెళ్లి వృద్ధుడి మృతి

ముదిగుబ్బ, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): చెత్తకు పెట్టిన నిప్పు మామిడి చెట్ల వైపు వస్తుందని భావించిన ఓ వృద్ధుడు మంటలు ఆర్పడానికి వెళ్లి, అందులోనే పడి మృతి చెందిన సంఘటన స్థానిక కస్తూర్బా కాలనీ సమీపంలో జరిగింది. ముదిగుబ్బ ఏఎస్ఐ బాబు నాయక్ తెలిపారు. ఏఎస్ఐ తెలిపిన మేరకు మండల కేంద్రంలోని సాయినగర్‌కు చెందిన కొలిమి నాగప్ప(84) స్థానిక కస్తూర్బా కాలనీ సమీపంలో మామిడి చెట్లను లీజుకు తీసుకొని కాపలాగా ఉండేవాడు. గుర్తు తెలియని వ్యక్తులు శుక్రవారం తోట సమీపంలోని గడ్డికి నిప్పు పెట్టారు. దీంతో మంటలు మామిడి చెట్లకు వ్యాపిస్తాయన్న ఆందోళనతో వాటిని ఆర్పడానికి వెళ్లి మంటల్లో చిక్కుకుని మృతి చెందాడన్నారు. మృతుడి మనవడు రామాంజనేయులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

గేమ్ చేంజర్..!

వాట్సాప్‌లో ఒక్క మెసేజ్‌తో 161 సేవలు

- ధ్రువపత్రాలు మొదలు.. ఫిర్యాదుల వరకూ..
- నేరుగా సంబంధిత శాఖలకే సమాచారం
- ప్రజాసేవకు కూటమి ప్రభుత్వం సాంకేతిక హంగులు

కళ్యాణదుర్గం/ధర్మవరం, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ప్రజా సేవకు సాంకేతిక సొబగులు అద్దుతోంది. ప్రజలకు అవసరమైన ప్రభుత్వ సేవలను వేగంగా, పారదర్శకంగా అందించేందుకు వీలుగా మనమిత్ర పేరుతో వాట్సాప్ గవర్ననెన్స్‌కు నడుంబిగించింది. వాట్సాప్‌లో హాయ్ అని టైప్ చేసి 95523 00009 సెల్ నంబరును పంపితే చాలు 161 రకాల పౌర సేవలు అందుబాటులోకి వస్తాయి. తెలుగు భాషలో ప్రతి ఒక్కరికి అర్థమయ్యేలా వివరాలు పొందుపరిచి పౌరసేవలు అందేలా ఏర్పాట్లు చేశారు.

నేరుగా సంబంధిత శాఖలకే సమాచారం

వాట్సప్‌లో దరఖాస్తుదారుడు కోరిన పౌరసేవ ఏ శాఖ పరిధికి చెందుతుందో ఆ శాఖ అధికారులకే దరఖాస్తు వెళ్తుంది. ఏ సేవకు ఎంత సమయంలో ఇస్తున్నారన్న అంశం కూడా ఆయా శాఖల ఉన్నతాధికారులకు తెలిసే అవకాశం ఉంది. కోరిన సేవలు అందించడంలో జాప్యం చేస్తే ఉన్నతాధికారులకు వెంటనే తెలుస్తుంది. దీంతో వారు వేగవంతానికి చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది. ఫలితంగా ఆయా సేవల కోసం కార్యాలయాల చుట్టూ తిరిగే బాధ తప్పుతుంది.

మొత్తం 520 రకాల సేవలు

వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా మొత్తం 520 రకాల సేవలను ప్రభుత్వం అందుబాటులోకి తేవాలని భావిస్తోంది. అందులో భాగంగా తొలి విడతగా 161 రకాల పౌర సేవలను ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. మలివిడతలో మరిన్ని సేవలను అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపింది. తొలివిడతలో దేవదాయ, ఇంధన, ఏపీఎస్ ఆర్టీసీ, రెవెన్యూ, మున్సిపల్, సీఎంఆర్ఎఫ్, వైద్య, ఆరోగ్య, పోలీసు, సీడీఎంఏ తదితర శాఖల్లో ఈ సేవలు మొదలయ్యాయి. ఉదాహరణకు దేవదాయశాఖకు సంబంధించిన వివిధ ఆలయాల్లోని సేవలు, టికెట్ల బుకింగ్, ఆర్టీసీ రిజర్వేషన్, విద్యుత్ బిల్లుల చెల్లింపు, కొత్త కనెక్షన్ కోసం దరఖాస్తు, పాతకనెక్షన్ కోసం మార్పు ఇలా అనేక రకాల సేవలు వాట్సాప్ ద్వారా ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. పర్యాటక సేవల్లో భాగంగా రాష్ట్రంలోని పర్యాటక ప్రదేశాల సమాచారాన్ని వాట్సాప్‌లో



వాట్సాప్ గవర్నెన్స్ యాప్

పంపిస్తారు. కావాల్సిన ప్రదేశాన్ని ఎంపిక చేసుకుని టికెట్లు, వసతి సహా అన్నీ పొందవచ్చు. రెవెన్యూ విభాగం ద్వారా మనకు కావాల్సిన ఓబీసీ, ఈడబ్ల్యూఎస్, ఆదాయ, నోఎర్నింగ్ ఇలా వివిధ శాఖలకు సంబంధించిన అనేక సర్టిఫికెట్లు, ట్రేడ్ లైసెన్స్‌లు, రెవెన్యూశాఖకు సంబంధించి ల్యాండ్ రికార్డులు, వివిధ సర్టిఫికెట్లు వాట్సాప్ ద్వారా పొందవచ్చు. ముఖ్యమంత్రి సహాయ నిధికి చేసిన దరఖాస్తుల స్టేటస్ తెలుసు కోవచ్చు. ఆస్తిపన్నుల వంటివి ఈ అధికారిక వాట్సాప్ ద్వారాచెల్లించవచ్చు. ఏపీఎస్ ఆర్టీసీ టికెట్ బుకింగ్, క్యాన్సిలేషన్, జర్నీ, రిమైండర్, ట్రాకింగ్‌సర్వీసు, రిఫండ్, ఫీడ్ బ్యాక్ తదితర సేవలు దీని ద్వారా పొందవచ్చు.

సేవలు ఇలా...

రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా 9552300009 నెంబరును కేటాయించింది. ఈ నెంబరును మొబైల్‌లో యాడ్ చేసుకోవాలి. ప్రజలు వారికి కావాల్సిన సేవలు పొందడానికి ఏవైనా ఫిర్యాదులు ఉంటే తెలియజేయడానికి ఆ నెంబరుకు వాట్సాప్‌లో హాయ్ అని మెసేజ్ చేయాలి. వెంటనే సేవను ఎంచుకోండి అనే మెసేజ్ ఆప్షన్ వస్తుంది. దాన్నిక్లిక్ చేస్తే ఒక మెనూ వస్తుంది. ఆ మెనూలో మనకు కావాల్సిన విభాగాన్ని ఎంచుకుని, కావాల్సిన సేవలను ఎంచుకోవాల్సిన ఉంటుంది. అవి సంబంధిత శాఖ అధికారుల లాగిన్‌లోకి వెళతాయి. వాటి ఆధారంగా అధికారులు పరిష్కారం, సేవలు అందిస్తారు.

కార్యాలయాలకు వెళ్లాల్సిన పనిలేదు

మన మిత్ర నంబరు(9552300009) ద్వారా అన్ని రకాల సేవలను సద్వినియోగం చేసుకున్నట్లయితే, కార్యాలయాల వద్దకు వెళాల్సిన అవసరం ఏ మాత్రం ఉండదు. ఇంట్లోనే కూర్చొని సెల్‌ఫోన్‌లోనే అన్నీ సేవలను పొందేందుకు అవకాశం ఉంటుంది. ఆ దిశగా అధికారులు కూడా అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. కాని ఏ ఒక్క అధికారి కూడా వీటిపై ప్రత్యేక శ్రద్ధ కనపరచడం లేదు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నప్పటికీ క్షేత్రస్థాయిలో పూర్తిగా అమలుకు నోచుకోలేదు. అధికారులే ప్రత్యేక దృష్టి సారించి ప్రజలందరికీ అవగాహన కల్పిస్తే వ్యయప్రయాసలు తప్పే అవకాశం ఉంటుంది.

ఆశలు మోడు..!

చీనీ చెట్లకు విల్ట్ తెగులు

- నిలువునా ఎండిపోతున్న దుస్థితి
- కాపు బాగా వచ్చిన చెట్లపైనే ప్రభావం
- కాపాడుకునేందుకు అన్నదాత అష్టకష్టాలు
- కళ్లముందే ఎండిపోతుంటే కన్నీళ్లు పెట్టుకుంటున్న వైనం
- అవగాహన కల్పించని అధికారులు

కూడేరు, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): లక్షల రూపాయలు అప్పులు చేసి సాగుచేసిన చీనీ చెట్లు కళ్ల ముందే ఎండిపోతుంటే అన్నదాత బాధ వర్ణనాతీతం. పంటను కంటికి రెప్పలా కాపాడుకుని తీరా కాపునకు వదిలిన సమయంలో చెట్లు ఎండిపోతున్నాయి. అది కూడా దిగుబడి బాగా వచ్చిన చెట్లే దెబ్బతింటున్నాయి. దీంతో వాటిని కాపాడుకునేందుకు రైతు నానా తిప్పలు పడుతున్నాడు. అయినా చెట్లు ఎండిపోయి, మోడుగా మిగులుతున్నాయి. జిల్లావ్యాప్తంగా 92,966 ఎకరాల్లో చీనీ సాగవుతోంది. కూడేరు, గార్లదిన్నె, గుత్తి, శింగనమల, పామిడి, తాడిపత్రి, బుక్కరాయసముద్రం, ఆత్మకూరు, రాప్తాడు, తదితర మండలాల్లో అత్యధిక విస్తీర్ణంలో సాగు చేస్తున్నారు. చెట్లు 20 ఏళ్లపాటు కాపు కాస్తాయి. తెగుళ్ల బారినపడి ఆరేడేళ్లకే చనిపోతున్నాయి. గతంలో చీనీ తోటలను శాస్త్రవేతలు పరిశీలించి, చెట్లకు సోకే తెగుళ్ల, వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రతలపై రైతులకు అవగాహన కల్పించేవారు. కొంతకాలంగా చీనీ తోటల వైపు శాస్త్రవేత్తలే కాదు, ఉద్యాన శాఖాధికారులు కూడా కన్నెత్తి చూడట్లేదని రైతులు వాపోతున్నారు. దీంతో ఎండిపోతున్న చీనీ చెట్లను కాపాడుకోవడానికి ఎరువుల దుకాణాల నిర్వాహకులు ఇచ్చే సూచనలతో వేలాది రూపాయలు ఖర్చు చేసి, మందులు వాడినా ఫలితం లేకుండాపోతోంది. ఒక్కో తోటలో 30 నుంచి 70 వరకు దిగుబడి వచ్చిన చెట్లు ఎండిపోతున్నాయి. వేలాది రూపాయలు ఖర్చు చేసి, కాపాడుకుంటున్న చెట్లు కళ్లముందే ఎండిపోతుంటే అన్నదాత ఆవేదన వర్ణనాతీతం.

విల్ట్ తెగులు సోకి...

విల్ట్ తెగులు సోకడంతోనే చీనీ చెట్లు ఎండిపోతున్నాయని ఉద్యాన శాఖాధికారులు చెబుతున్నారు. చీనీ చెట్లను కాపునకు వదిలిన సమయంలో వాటి మొదళ్ల వద్ద మట్టిని తీసి, పాదులు చేయకుండానే సేంద్రియ, రసాయన ఎరువులను నేరుగా అందించడంతో విల్ట్ వ్యాధి సోకుతోంది. దీంతో చెట్టు వేరు కుళ్లిపోయి దిగుబడి బాగా వచ్చిన చెట్లు ఎండిపోయి, కాయలు పసుపు రంగులోకి మారి ఎండిపోతున్నాయి. కొంతకాలంగా తోటల్లో చీనీచెట్లు ఎండిపోతున్నా రైతులకు అవగాహన కల్పించే నాథుడే కరువయ్యాడు.



ఎండిపోయిన చీనీ చెట్టు

30 చెట్లు దెబ్బతిన్నాయి..



450 చీనీ చెట్లు సాగుచేశా. దిగుబడి ఆశాజనకంగా వచ్చింది. సంతోషంతో ఉన్న సమయంలో ఒక్కో చెట్టు ఎండిపోతుండడంతోపాటు వాటిలోని కాయలు పసుపు రంగులోకి మారిపోతున్నాయి. ఇలా 30 చెట్ల వరకు దెబ్బతిన్నాయి. మందుల షాపు వారిని సంప్రదిస్తే పదివేల రూపాయల విలువైన మందులు ఇచ్చారు. వాటిని చెట్లకు వదిలినా ఫలితం దక్కలేదు. ఏం చేయాలో దిక్కుతోచట్లేదు.

-ఆవుల ఎర్రిస్వామి, చీనీ రైతు, పి. నాగిరెడ్డిపల్లి

చెట్లు ఎండిపోతున్నాయి..



నా పొలంలో 250 చీనీ చెట్లు కాపునకు వచ్చాయి. ఆశించిన మేర దిగుబడి వచ్చినా చెట్లు కళ్ల ముందే ఎండిపోతుండటంతో విలవిల్లాడుతున్నాం. తోటలో 35 చెట్లు ఎండిపోవడం, మరిన్ని వాడు పట్టడంతో ఏం చేయాలో అర్థంకాక రాత్రిళ్లు నిద్ర పట్టడంలేదు. ఎన్ని చర్యలు తీసుకుంటున్నా చెట్లను కాపాడుకోలేకపోతున్నా.

-బోయ రామాంజనేయులు, చీనీ రైతు, పి. నాగిరెడ్డిపల్లి

బంబేరి వేరు మీద కట్టిన చెట్లకు తెగులు



రంగపురి అంట్ల మీద కట్టిన చీనీ మొక్కలు తెగుళ్లను తట్టుకోగలవు. జిల్లాలో ఎక్కువగా జంబేరి వేరు మీద కట్టిన అంటు మొక్కలను నాటడం కారణంగా తెగులు అధికంగా సోకుతోంది. దిగుబడి బాగా వచ్చిన చెట్లలో విల్ట్ తెగులు కనిపిస్తుంది. చెట్టు ఆకులు రాలిపోయి, ఎండిపోతుంది. తెగుళ్ల నివారణకు ఆరోగ్యంగాలేని చెట్ల వేర్ల మొదల్లో కట్ చేసి, బోర్డక్స్ పేస్ట్ పూయాలి. పశువుల ఎరువు, వేపచెక్కతోపాటు ట్రైకోడెర్మావిడిని మిశ్రమంగా కలిసి పైన నీరు చల్లి బాగా మగ్గ బెట్టి (నానబెట్టి) చెట్టుకు 5 కేజీలు వేయాలి. వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉంటే సిఓసి 3 గ్రాములు లీటరు నీటిలో కలిపి చెట్టు మొదలు వద్ద తడపాలి. రెడోమైల్ ఎంజెడ్ 2 గ్రాములు లీటరు నీటిలో కలిపి చెట్టు మొదళ్ల దగ్గర పోయాలి. రైతులు రంగపురి అంట్లను నాటుకోవడమే మేలు.

-నెట్టికంటయ్య, ఉద్యాన శాఖాధికారి

ముగిసిన బొలికొండ బ్రహ్మోత్సవాలు



ప్రత్యేక అలంకరణలో స్వామి, అమ్మవార్లు

గుత్తిరూరల్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని తొండపాడులో వెలసిన బొలికొండ రంగనాథస్వామి బ్రహ్మోత్సవాలు శుక్రవారం వసంతోత్సవంతో ముగిశాయి. ఆలయంలో ఉదయం స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పల్లకీలో స్వామివారు, అమ్మవార్లను అధిష్ఠించి గ్రామవీధుల్లో మేళతాళాల మధ్య ఊరేగించారు. రాత్రి 9 గంటలకు స్వామివారికి ఊంజలసేవ నిర్వహించారు. అనంతరం స్వామివారు జక్కలచెరువుకు చేరుకుని, గ్రామంలో ఊరేగారు. వసంతోత్సవంతో ఉత్సవాలు ముగిశాయి.

రూ.9.40 లక్షల ఆదాయం

బొలికొండ రంగనాథస్వామి దేవాలయంలో శుక్రవారం దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ ఆదిశేషునాయుడు, ఆలయ ఈఓ రామాంజనేయులు ఆధ్వర్యంలో హుండీ లెక్కింపు చేపట్టారు. గత 9 రోజులు భక్తులు హుండీలో వేసిన కానుకలను లెక్కించారు. రూ.9.40 లక్షల ఆదాయం సమకూరినట్లు ఈఓ తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ రంగస్వామిరెడ్డి యాదవ్, అర్చకులు, రవిస్వామి, చేతన్ వర్మ, లికిల్‌వర్మ, రాఘవేంద్రచార్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

స్కూళ్లలో ప్రతి మూడో శనివారం స్వచ్ఛ ప్రతిజ్ఞ

అనంతపురం విద్య, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో నెలలో ప్రతి మూడో శనివారం స్వచ్ఛ ఆంధ్రా ప్రతిజ్ఞ చేయాలని డీఈఓ ప్రసాద్‌బాబు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. స్కూళ్లలో ఉదయం 9.30 నుంచి 11 గంటలలోపు నిర్వహించాలని అందులో పేర్కొన్నారు. స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించి, ఫొటోలను సంబంధిత యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. స్వచ్ఛ నిబంధనల మేరకు తప్పనిసరిగా ప్రతి స్కూల్‌లో తప్పక అమలు చేయాలని ప్రిన్సిపాళ్లు, ప్రధానోపాధ్యాయులు, కరస్పాండెంట్లను డీఈఓ ఆదేశించారు.

బావిలో పడ్డ కారు

ఒకరి మృతి.. మరొకరికి తీవ్రగాయాలు



కారును బావి నుంచి బయటకు తీస్తున్న దృశ్యం

శింగనమల, ఫిబ్రవరి14(ఆంధ్రజ్యోతి): నార్పల మండలం నడిమిదొడ్డి గ్రామ సమీపాన కారు అదుపుతప్పి, బావిలో పడిపోవడంతో అనంతపురానికి చెందిన షాబుద్దీన్ (40) మరణించగా.. ఇర్ఫాన్ తీవ్రంగా గాయపడ్డాడు. శింగనమల సీఐ కౌలుట్లయ్య తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అనంతపురంలోని గుల్జార్ పేటకు చెందిన షాబుద్దీన్, ఇర్ఫాన్ జియో కంపెనిలో పని చేస్తున్నారు. కంపెనీ పని నిమిత్తం నాయనపల్లి క్రాస్ నుంచి నార్పలకు కారులో బయల్దేరారు. నడిమిదొడ్డి గ్రామ సమీపాన ఆవును తప్పించే ప్రయత్నంలో కారు అదుపు తప్పి రోడ్డు పక్కనున్న బావిలో పడిపోయింది. బావి నీటిలో కారు మునిగిపోయింది. అందులో ఉన్న షాబుద్దీన్ ఊపిరాడక మృతి చెందాడు. ఇర్ఫాన్ కారు డోర్ గ్లాస్ కాసత తెరుచుకుని ఉండడంతో బయటకు వచ్చే ప్రయత్నం చేశాడు. అయినా వీలుకాలేదు. సమాచారం అందగానే సీఐ కౌలుట్లయ్య, ఎస్ఐలు విజయ్‌కుమార్, సాగర్ హుటాహుటిన ప్రమాద స్థలానికి చేరుకున్నారు. బావిలో ఉన్న కారును ఎక్స్‌కవేటర్ సాయంతో బయటకు తీశారు. గాయపడ్డ ఇర్ఫాన్‌ను ఆస్పత్రికి తరలించారు. షాబుద్దీన్‌కు భార్య, ఇద్దరు కూమారులు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా సేవాలాల్ జయంత్యుత్సవాలు

- స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు
- హాజరైన మహారాష్ట్ర మంత్రి సంజయ్‌భావ్ రాథోడ్

గుత్తి రూరల్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): మండంలోని సేవాఘడ్‌లో బంజారాల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహారాజ్ జయంత్యుత్సవాలు శుక్రవారం ఘనంగా జరిగాయి. స్వామివారికి వేకువజామునే పంచామృతాభిషేకం చేసి, వివిధ పుష్పాలతో అలంకరించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాతా జగదాంబ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవ మూర్తులను సాయంత్రం పల్లకిలో కొలువుదీర్చి మేళతాళాలతో ఊరేగించారు. మహారాష్ట్ర మంత్రి సంజయ్‌భావ్ రాథోడ్ వేడుకలలో పాల్గొన్నారు. ట్రస్టు అధ్యక్షుడు జగనాథరావు, సభ్యులు ఆశ్వత్థనాయక్, కేశవనాయక్, రవీంద్రనాయక్, ఆర్డీఓ శ్రీనివాసులు ఆయనకు స్వాగతం పలికారు. స్వామి, అమ్మవార్లకు మహారాష్ట్ర మంత్రి ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. మంత్రిని ట్రస్టు సభ్యులు ఘనంగా సత్కరించారు. వేడుకలలో భాగంగా శనివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.

సేవాలాల్ మార్గాన్ని అనుసరించాలి: మంత్రి సత్యకుమార్

సేవాలాల్ మహారాజ్ చూపిన మార్గాన్ని బంజారాలు అనుసరించాలని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ సూచించారు. సేవాఘడ్‌లో సంత్ సేవాలాల్ మహారాజ్ 286వ జయంత్యుత్సవాలను శుక్రవారం రాత్రి ఆయన ప్రారంభించారు. ట్రస్టు అధ్యక్షుడు జగన్నాథరావు, ఉపాధ్యక్షుడు కేశవనాయక్, సభ్యులు అశ్వత్థ నాయక్‌తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేశారు. సేవాఘడ్‌ను పవిత్ర క్షేత్రం తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్నామని మంత్రి అన్నారు. ఎన్డీఏ ప్రభుత్వం సేవాఘడ్‌కు రూ.50 లక్షల నిధులు ప్రకటించిందని అన్నారు. సేవాఘడ్ పవిత్ర క్షేత్రమని గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం అన్నారు. బంజారా జాతి పురోగతికి మార్గోపదేశం చేసిన మహనీయుడు సంత్ సేవాలాల్ మహారాజ్ అని అన్నారు. సేవాలాల్ చూపిన మార్గంలో నడవాలని బంజారాలకు టీడీపీ జిల్లా అధ్యక్షుడువెంకటశివుడు యాదవ్ సూచించారు. కార్యక్రమంలో ఆర్డీఓ శ్రీనివాసులు, తహసీల్దారు ఓబులేసు, ట్రస్టు సభ్యులు రవీంద్ర నాయక్, ఎస్కే రామచంద్ర నాయక్, సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ సురేష్ బాబు, ఎంపీడీఓ ప్రభాకర్ నాయక్, ఈఓఆర్డీ శివాజీ రెడ్డి పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో పూజలు అందుకుంటున్న సేవాలాల్ మహారాజ్



జ్యోతి ప్రజ్వలనలో పాల్గొన్న ట్రస్టు అధ్యక్షుడు జగన్నాథరావు, ఫొటోలో మంత్రి సత్యకుమార్ యాదవ్, ఎమ్మెల్యే గుమ్మనూరు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్

హత్యాయత్నం కేసులో భర్త అరెస్ట్

పరిగి, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): భార్యను చంపేందుకు యత్నించిన భర్తను శుక్రవారం అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. కరియప్ప, నిర్మలమ్మకు 26 కిందట వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమార్తెలు సంతానం. మనస్పర్థల నేపథ్యంలో దంపతులు నాలుగేళ్ల కిందట విడిపోయారు. ఈక్రమంలో నిర్మలమ్మ హిందూపురంలో, కరియప్ప మండలంలోని బీచిగానిపల్లిలో నివాసం ఉంటున్నారు. కుమార్తెలు ఇద్దరూ నిర్మలమ్మ వద్దే ఉంటున్నారు. ఇటీవల పెద్దకుమార్తె వివాహం నిశ్చయమైంది. ఈనేపథ్యంలో కుమార్తె లగ్నపత్రికను తండ్రి అయిన కరియప్పకు ఇవ్వడానికి నిర్మలమ్మ గురువారం బీచిగానిపల్లికి వచ్చింది. ఇంటికి వచ్చిన ఆమెను చూసిన కరియప్ప ఆగ్రహంతో నా కుమార్తె పెళ్లి చేయడానికి నీవెవరు అంటూ వాగ్వాదానికి దిగాడు. ఈక్రమంలోనే పక్కనే ఉన్న కొడవలితో ఆమె భుజం, చేయిపై నరికాడు. ఆమె కేకలు వేయడంతో గ్రామస్థులు అక్కడికి రాగా కరియప్ప పరారయ్యాడు. రక్తపు మడుగులో ఉన్న నిర్మలమ్మను హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ విషయంపై కేసు నమోదు చేసుకుని నిందితుడి కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. కొడికొండ-శిర హైవే సమీపంలో కరియప్ప ఉండగా శుక్రవారం ఉదయం అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ రంగడుయాదవ్ తెలిపారు.

రైతులకు వ్యాపారి కుచ్చుటోపీ

బెళుగుప్ప, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల రైతుల నుంచి కళ్యాణదుర్గానికి చెందిన వ్యాపారి మొక్కజొన్న కొనుగోలు చేసి, డబ్బులివ్వకుండా కుచ్చుటోపీ పెట్టాడు. మండలంలోని యలగలవంక, గుండ్లపల్లి, నరసాపురం, రమణేపల్లితో పాటు కళ్యాణదుర్గం, ఉరవకొండ తదితర ప్రాంతాల్లో 90 మందికిపైగా మోసపోయారు. రైతులు పండించిన మొక్కజొన్న పంటను కొనుగోలు చేసిన వ్యాపారి.. డబ్బు అడిగితే అదిగో.. ఇదిగో అంటూ కాలయాపన చేశారు. ఆఖరుకు కోర్టు నుంచి ఐపీ నోటీసులు పంపాడు. దీంతో రైతులు లబోదిబోమంటున్నారు.

పట్టించుకోరా..?



పోలీస్ క్వార్టర్స్ ఆవరణలో ఏపుగా పెరిగిన చెట్లు

- శిథిలావస్థలో గాండ్లపెంట పోలీస్ క్వార్టర్స్
- నిరుపయోగంగా విలువైన స్థలం
- ఊరి మధ్యలో అడవిలా మారిన వైనం
- 15 ఏళ్లుగా ఇదే దుస్థితి
- వ్యాపార సముదాయం నిర్మించాలంటున్న స్థానికులు

గాండ్లపెంట, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం మధ్యలో సుమారు నాలుగు ఎకరాల్లో ఉన్న పోలీస్ క్వాటర్సు పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. కదిరి, రాయచోటి, మల్లమీదపల్లి ప్రధాన రహదారి సమీపంలోనే ఈ స్థలం ఉంది. అలాంటి రద్దీ, విలువైన ప్రాంతంలో నాలుగు ఎకరాల స్థలాన్ని పాలకులు, అధికారులు 15 సంవత్సరాలుగా నిరుప యోగంగా ఉంచారు. భవనాలు శిథిలావస్థకు చేరుకో వడంతో వాటిలో పోలీసులు నివాసం ఉండటం లేదు. వైసీపీ పాలనలో ఆ క్వార్టర్స్‌లోని కొన్ని భవనాలను కూల్చివేశారు. టెండర్ పాడిన వ్యక్తి విలువైన తీర్లు, తలుపులు, కిటికీలను తీసుకెళ్లాడు. మిగిలిన భవనా లనూ కూల్చి ఆ ప్రాంతంలో దుకాణాల సముదా యాన్ని నిర్మిస్తారని స్థానికులు ఆశించారు. అయితే ఆ పనులు అంతటితో ఆగిపోయాయి. దీంతో ప్రస్తుతం ఆ ప్రాంతమంతా పిచ్చిమొక్కలు, ముళ్లకంపలు భారీగా పెరిగి.. ఓ చిన్నపాటి అడవిని తలపిస్తోంది. ఆ ప్రాంతం విష సర్పాలకు నిలయంగా మారడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

● కాంప్లెక్స్ నిర్మాణంతో ఆదాయం

మండల కేంద్రానికి మధ్యలో ఉన్న ఈ స్థలంలో కాంప్లెక్స్ నిర్మిస్తే.. ప్రభుత్వానికి భారీ ఆదాయం వస్తుంది. ప్రధాన రహదారికి ఇరువైపులా చిరు వ్యాపారులు తోపుడుబండ్లపైన, బంకులు ఏర్పాటు చేసుకుని వ్యాపా రులు చేస్తున్నారు. ఇలాంటి వారికి ఈ ప్రాంతం దాదా పు 50 నుంచి 60 దుకాణాల గదుల నిర్మిస్తే.. ఇటు చిరు వ్యాపారులకు సౌకర్యంగా ఉండటంతో పా టు.. ప్రభుత్వానికి ఆదాయమూ వస్తుందని స్థానికులు అభి ప్రాయపడుతున్నారు. అంతేకాకుండా రోడ్డుకు ఇరు వైపులా ఉన్న తోపుడుబండ్లు, బంకులు తొలగిస్తే.. ట్రాఫిక్ సమస్య కూడా పరిష్కారం అవుతుందని అం టున్నారు. ఈ విషయాన్ని పలుమార్లు ఉన్నతా ధికారుల దృష్టికి తీసుకొని వెళ్లినా.. వారు ఏ మాత్రం పట్టించుకోలేదన్నారు.

● పోలీసుల ఇక్కట్లు

మండల కేంద్రంలోని పోలీస్ క్వార్టర్స్‌లో పాడుబడిన భవనాలను కూల్చి వేసి.. కొత్త వాటిని నిర్మిస్తే.. పోలీసులైన ఉండటానికి ఆస్కారం ఉంటుంది. క్వాటర్స్ శిథిలావస్థలో ఉండటంతో పోలీసులు కదిరిలో ఉంటూ.. రోజూ ఇక్కడ విధులకు హాజరవుతున్నారు. ఇక్కడే నూతన భవనాలు నిర్మిస్తే పోలీసులు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటారు.



ప్రధాన రోడ్డు పక్కన ఉన్న దుకాణాలు

కాంప్లెక్స్ నిర్మిస్తే మేలు



ప్రధాన రహదారికి ఇరువైపులా అనేక మంది చిన్న, మధ్య వ్యాపారులు తోపుడుబండ్లు, బంకులు ఏర్పాటు చేసుకొని జీవనం సాగిస్తున్నారు. ఎండ, వాన, చలిలోనే వ్యాపా రాలు చేసుకొంటు ఇబ్బందులు పడుతున్నారు. ఆ పోలీస్ క్వాటర్స్‌లోని భవనాలను తొలగించి.. అక్కడ వ్యాపార సముదాయాన్ని నిర్మిస్తే.. ఈ వ్యాపారులకు చాలా సౌకర్యంగా ఉంటుంది. అంతేకాకుండా ప్రభుత్వానికి ఆదాయం కూడా వస్తుంది. కనీసం ఆ ప్రాంతంలో షెడ్లు అయినా నిర్మించేలా చర్యలు తీసుకోవాలి.

-ఖాజాపీర్, కూరగాయాల వ్యాపారి, గాండ్లపెంట

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం

గాండ్లపెంట పోలీస్టేషన్ ఆవరణంలో ఉన్న క్వాటర్సు శిథిలావస్థకు చేరుకుంది. అక్కడ ఆ భవనాలను తొలగించి.. ఆ స్థలంలో కాంప్లెక్స్ నిర్మించాలనే విషయా న్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తతాం.

- శివనారాయణస్వామి, డీఎస్పీ, కదిరి

న్యూస్ బాక్స్

రేపు మెగా జాబ్‌మేళా

పుట్టపర్తిరూరల్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతీయువకులు ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి శుక్రవారం ప్రకటనలో తెలిపారు. జాబ్‌మేళాలో ప్రఖ్యాత కంపెనీలు 50పైగా పాల్గొంటాయని, ఉదయం 9 గంటల నుంచి ఈ జాబ్‌మేళాను నిర్వహిస్తామన్నారు. టెన్త్.. ఆపైన విద్యార్హతలున్న నిరుద్యోగ యువతీయువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కోరారు.

18 నుంచి ఆధార్ ప్రత్యేక శిబిరాలు

ధర్మవరంరూరల్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): మండలవ్యాప్తంగా అన్ని గ్రామసచివాలయాల్లో ఈనెల 18 నుంచి 28 వరకు ఆధార్ ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేస్తున్నామని ఎంపీడీఓ సాయిమనోహర్ తెలిపారు. శుక్రవారం ఆయన ఎంపీడీఓ కార్యాలయంలో మాట్లాడుతూ.. ప్రతి సచివాలయపరిధిలోని ఎన్‌రోల్‌మెంట్ కాని పిల్లలకు, అదేవిధంగా 5-15సంవత్సరాల పిల్లలకు బయోమెట్రిక్ అప్‌డేట్ చేస్తారన్నారు. ఈనెల 18న రావులచెరువు, 20న మల్లాకాల్వ సచివాలయంలో మల్లాకాల్వ, ధర్మపురి గ్రామాలకు, 21న తుమ్మల సచివాలయంలో తుమ్మల, సుబ్బరావుపేట గ్రామాలకు, 24న గొట్లూరు సచివాలయంలో గొట్లూరు-1, 2, 25న చిగిచెర్ల, 27న పోతుకుంట సచివాలయంలో కుణుతూరు, పోతుకుంట, 28న పోతులనాగేపల్లి సచివాలయంలో రేగాటిపల్లి, పోతులనాగేపల్లి, సీసీకొత్తకోట ప్రజలకు స్పెషల్ క్యాంపు నిర్వహిస్తామన్నారు.

నేడు డీలర్లు, ఉపాధి సిబ్బంది సమావేశం

ఓబుళదేవరచెరువు, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ చౌకధాన్యపు డిపో డీలర్లు, ఉపాధి సిబ్బందితో శనివారం ఉదయం 11గంటలకు ఓడీసీ వెంకటసాయి ఐటీఐలో సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే పీఆర్‌ఓ ఎద్దుల సంతోష్‌రెడ్డి తెలిపారు. అమడగూరు, ఓడీసీ, నల్లమాడ మండలాలకు చెందిన డీలర్లు, ఉపాధి ఏపీఓ, టెక్నికల్, ఫీల్డు అసిస్టెంట్లు సమావేశానికి హాజరుకావాలన్నారు. సమావేశంలో ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి పాల్గొంటారన్నారు.

అర్ధరోజు కాంప్లెక్స్ సమావేశాలు వద్దు

నంబులపూలకుంట, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం తీసుకొచ్చిన అర్ధరోజు కాంప్లెక్స్ నిర్వాహణ వద్దని, పాత పద్ధతిన పాఠశాల సముదాయాల నిర్వహణ కొనసాగించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు హరిప్రసాద్‌రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఉపాధ్యాయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతినెలా మూడో శనివారం అర్ధరోజు కాంప్లెక్స్ సమావేశం నిర్వహించాలని ప్రభుత్వం షెడ్యూల్ విడుదల చేసిందని, రవాణా సౌకర్యాలు సరిగా లేకపోవడంతో ఉపాధ్యాయులు 25 కిలోమీటర్ల దూరం ప్రయాణించి హాజరుకావడం ఇబ్బందిగా ఉంటోందన్నారు.

విద్యార్థులకు కంటి అద్దాల పంపిణీ

ధర్మవరం, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): స్థానిక మున్సిపల్ బీఎస్ఆర్ బాలుర ఉన్నత పాఠశాలలో 156 మంది విద్యార్థులకు ఆర్డీఓ మహేశ్, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీశ్‌బాబు శుక్రవారం కంటి అద్దాలను పంపిణీచేశారు. కార్యక్రమంలో డిప్యూటి డీఎం అండ్‌హెచ్‌ఓ సెల్వియా సాల్మాన్, పాఠశాల హెచ్‌ఎం రాం ప్రసాద్, కంట వైద్యులు ఉరుకుందప్ప, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ గౌతమి, సిబ్బంది లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

● కదిరి : తలుపులలోని ప్రభుత్వ పాఠశాలలో 22 మంది, కేజీబీవీ పాఠశాలలో 14 మంది విద్యార్థినులకు కంటి అద్దాలు పంపిణీచేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అష్రాఫ్, వైద్యసిబ్బంది జయరాములు, రామమోహన్, శంకరమ్మ, ప్రభాకర్, పుష్పా, కెజీబీవి ఎస్‌ఓ మోహనమ్మ, హెచ్‌ఎం శంకర్ పాల్గొన్నారు.

వేరుశనగ, కంది సాగుపై అవగాహన

ఓబుళదేవరచెరువు, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): అమడగూరు మండలంలోని పూలకుంటపల్లిలో వేరుశనగ, కంది పంట సాగుపై ఏఓ వెంకటరమణాచారి శుక్రవారం అవగాహన కల్పించారు. వేరుశనగ సాగుచేసిన రైతులు పూత, ఊడ దశలో నీరు పెట్టి, ఎకరాకు రెండువందల కిలో జిప్సం చల్లాలని, తద్వారా గింజలు నాణ్యత పెరుగుతుందన్నారు. నూనె శాతం పెరగడంతోపాటు, రసం పీల్చే పురుగుల నివారణకు వేప గింజల కషాయం పిచికారి చేయాలన్నారు. పురుగులు గుడ్డు దశలో నివారించ వచ్చను. అలాగే లద్దె పురుగు ఎక్కువగా ఉంటే లార్విన్, లేదా యోమెక్టిన్ బెంబోఏట్ పిచికారి చేయాలన్నారు. కార్యక్రమంలో రైతు సేవా కేంద్రం సిబ్బంది, ఏఈఓ రమేష్ నాయక్, రైతులు పాల్గొన్నారు.

17న అంగన్‌వాడీ సమస్యలపై ఆందోళన

పుట్టపర్తిరూరల్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ సమస్యలను పరిష్కరించాలని సోమవారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం ముందు నిరసన చేపడతున్నామని, ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఈఎస్ వెంకటేసు కోరారు. శుక్రవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. అంగన్‌వాడీ సమస్యలను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేకపోవడం ఈ నిరసన కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో ప్రాజెక్టు అధ్యక్షుడు సుజాత, ప్రధాన కార్యదర్శి నాగమణి, సీఐటీయూ మండల కార్యదర్శులు బ్యాళ్ళ అంజి, ముత్యాలు పాల్గొన్నారు.

ఆర్డీఓలు బాధ్యతగా పనిచేయాలి : కలెక్టర్



ఆర్డీఓలతో మాట్లాడుతున్న కలెక్టర్, జేసీ

పుట్టపర్తిటౌన్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని శాసన సభ నియోజకవర్గాల ప్రత్యేకాధికారులుగా నియమింతమైన రెవెన్యూ డివిజన్ అధికారులు (ఆర్డీఓ) బాధ్యతయుతంగా పనిచేయాలని కలెక్టర్ టీఎస్ చేతన్ సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని కోర్టు చాంబర్‌లో శాసనసభ నియోజకవర్గాల ప్రత్యేక అధికారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ఆర్డీఓలు క్షేత్ర స్థాయిలో పర్యటించి, ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. అన్ని నియోజవర్గాల రాబోయే ఐదు సంవత్సరాలకు అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. ఫ్రీహోల్డు భూముల వ్యవహారంలో తనకల్లు తహసీల్దార్ శోభాసువర్ణమ్మకు షోకాజ్ నోటీసు జారీ చేయాలని జేసీ అభిషేక్‌కుమార్‌కు కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓలు సువర్ణ, ఆనంద్, వీవీఎస్ శర్మ, మహేష్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సూర్యనారాయణరెడ్డి, డీఈఓ క్రిష్టప్ప పాల్గొన్నారు.

సబ్ సెంటర్ తనిఖీ

తనకల్లు, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని బాలసముద్రం సబ్‌సెంటర్‌ను డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ నాగేంద్రనాయక్ శుక్రవారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. క్యాన్సర్, టీబీ సర్వేలపై ఆరా తీశారు. సర్వేలను త్వరగా పూర్తి చేయించాలని కొక్కంటి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం డాక్టర్ ధర్మరాజుకు ఆదేశించారు. ఎంపీహెచ్‌ఈఓ ఓబులేసు, వైద్య సిబ్బంది ఉన్నారు.

విద్యార్థులకు ఫిజియో థెరఫీ

కదిరి, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలోని భవిత కేంద్రంలో విద్యార్థులకు ఫిజియోథెరఫీ క్యాంపు నిర్వహించారు. ప్రతి శుక్రవారం నిర్వహించే ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఫిజియోథెరపిస్ట్ రూపేష్‌నాయక్ కోరారు. కార్యక్రమంలో ఎంఈఓలు చెన్నక్రిష్ణ, ఓబుళరెడ్డి, భవిత సెంటర్ ఉపాధ్యాయులు సౌజన్య, అన్వేష్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి మంత్రి పరామర్శ



గడ్డం రాజగోపాల్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న మంత్రి

ముదిగుబ్బ, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): ధర్మవరం నియోజకవర్గ సామాజికవేత్త గడ్డం రాజగోపాల్ యాదవ్ కుటుంబాన్ని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ శుక్రవారం పరామర్శించారు. ముదిగుబ్బ మండలం మద్దన్నగారిపల్లికి వెళ్లి గడ్డం రాజగోపాల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

● నేతన్న నేస్తం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇవ్వండి

ధర్మవరం : ఎన్నికల్లో చేనేతలకు ఇచ్చిన హామీల్లో భాగంగా నేతన్న నేస్తం, 200 యూనిట్లు ఉచిత విద్యుత్ వెంటను అమలు చేయాలని మంత్రి సత్యకుమార్‌ను చేనేత నాయకులు శుక్రవారం విజ్ఞప్తి చేశారు. మంత్రిని కలిసిన వారిలో చేనేత కార్మిక సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు వెంకట స్వామి, అధ్యక్షుడు పోలా లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి వెంకటనా రాయణ, చేనేత నాయకులు చెన్నంపల్లి శ్రీనివాసులు, సీపీఐ పట్టణ కార్యదర్శి రవికుమార్ ఉన్నారు.

● అభివృద్ధి పనులకు మంత్రి శ్రీకారం

మంత్రి సత్యకుమార్‌యాదవ్ శుక్రవారం పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. నలుగురు బాధితులకు రూ.6,50,962 విడుదలైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులనుఅందజేశారు. హిందూశ్మశాన వాటికలో సీసీరోడ్డు నిర్మాణం, కల్వర్టు నిర్మాణం, ముస్లీం శ్మశాన వాటికలో జంగిల్ క్లియరెన్స్, మట్టితో అభివృద్ధి కార్యక్రమాలకు భూమిపూజ చేశారు. డివైండర్ల మధ్యలో మొక్కలు నాటారు. ధర్మవరం చెరువులో 1.35 లక్షల చేపపిల్లలను వదిలారు. రోడ్డుభద్రతా వారోత్సవాలలో భాగంగా ఆర్టీఏ అధికారులు నిర్వహించిన బైకు ర్యాలీని ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి, కమిషనర్ ప్రమోద్ కుమార్, ఆర్టీఏ రాణి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు జీఎంశేఖర్, నియో జకవర్గ ఇన్‌చార్జ్ హరీశ్, పట్టణ, రూరల్ అధ్యక్షులు జింకాచంద్రశేఖర్, గొట్లూరు చంద్ర పాల్గొన్నారు.

సత్తా చాటిన విద్యార్థులకు అభినందన



విద్యార్థులకు మెమెంటోలు అందిస్తున్న డీఈఓ

బుక్కపట్నం, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): స్కూల్ ఆఫ్ గేమ్స్-2025 కీడల్లో సత్తాచాటి.. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన బుక్కపట్నం బాలుర పాఠశాలకు చెందిన 21 విద్యార్థులను డీఈఓ క్రిష్టప్ప శుక్రవారం అభినందించారు. వీరికి మెమెంటోలు, ప్రశాంసాపత్రాలు అందించారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు రాష్ట్రస్థాయిలో రాణించడం హర్షిచదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ గోపాల్‌నాయక్, హెచ్‌ఎం జగదీష్, పీడీ నాగరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాజీ సైనికులకు సన్మానం



మాజీ సైనికులను సన్మానిస్తున్న హెచ్‌ఎం, సిబ్బంది, విద్యార్థులు

ధర్మవరం, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): పుల్వామా ఘటనలో మరణించిన 40 మంది వీర సైనికులను స్మరిస్తూ శుక్రవారం బ్లాక్‌డేను స్థానిక సూర్య పాఠశాలలో నిర్వహించారు. మాజీ సైనికులు నాగమల్లేశ్వర రెడ్డి, సుధాకర్ రెడ్డి, రామాంజనేయులును హెచ్‌ఎం నరేంద్ర సన్మానించారు.

● నంబులపూలకుంట: పుల్వామా ఉగ్రదాడిలో ప్రాణాలు అర్పించిన వీర జవాన్లను స్మరించుకుంటూ మండలంలోని గూటిబైలు గ్రామంలో శుక్రవారం నివాళ్లు అర్పించారు. ఇందులో బీజేపీ జిల్లా నాయకుడు జయరాం, వేమనారి, రామాంజులు, ఆంజనేయులు పాల్గొన్నారు.

పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

ధర్మవరం, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జీవానంద పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని విద్యార్థిసంఘాల నాయకులు.. ఆర్డీఓ మహేశ్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. పాఠశాల యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగా విద్యార్థి ప్రజ్వలానంద పాఠశాల పక్కన చెత్తకుప్పలను అంటించిన మంటలోపడి తీవ్రంగా గాయపడ్డాడన్నారు. పాఠశాల యాజమాన్యంపై రూ.5లక్షలు జరిమానా విధించడంతో పాటు క్రిమినల్ కేసు నమోదు చేయించాలని కోరారు. లేనిపక్షంలో పెద్దఎత్తున ఉద్యమాలు చేస్తామన్నారు. ఆర్డీఓను కలిసిన వారిలో విద్యార్థి సంఘాల నాయకులు పోతులయ్య, నిరంజన్, జగదీశ్, తరుణ్, మహేశ్, విజయ్ ఉన్నారు.



గంగమ్మ ఆలయం వద్ద ఆందోళన చేస్తున్న నాయకులు

ఆలయ వ్యవహారాల్లో అన్యమతస్థులు వద్దు

కదిరిఅర్బన్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎర్రదొడ్డి గంగమ్మ ఆలయ వ్యవహారాల్లో అన్యమతస్థులకు కాకుండా హిందువులకే అవకాశం ఇవ్వాలని హిందూ ధర్మాక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆలయం వద్ద ఆందోళన చేపట్టిన వారు మాట్లాడారు. వేలాది మంది భక్తులు గ్రామదేవత గంగమ్మకు కోళ్లు, పొటేళ్లను నైవేద్యంగా సమర్పించి.. మొక్కులు తీర్చుకుంటారని, దీన్ని అన్యమతస్తులు హలాల్ పద్ధతిలో నిర్వహిస్తున్నారని వాపోయారు. అలా కాకుండా హిందు సంప్రదాయ జూట్కా పద్ధతిలో హిందువులే అమ్మవారికి నైవేద్యం సమర్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు ఆలయం ఆవరణంలో దేవదాయ, ధర్మదాయ అధికారులు ఓ బోర్డు ఏర్పాటు చేయాలని అన్నారు. అలాగే ఆలయ పరిధిలో దుకాణాలను హిందూవులకే కేటాయిచాలన్నారు. ఆలయ ఆవరణంలో విద్యుత్ దీపాలు, మౌలిక సదుపాయలు కల్పించాలన్నారు. అనంతరం వినతిపత్రాన్ని ఆలయ ఈఓ రవీంద్రరాజుకు అందచేశారు. కార్యక్రమంలో విశ్వ హిందూపరిషత్, భజరంగ్‌దళ్, ఆర్‌ఎస్‌ఎస్ సభ్యులు పాల్గొన్నారు.

మామిడి తోటలో అగ్ని ప్రమాదం

ముదిగుబ్బ, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండగట్టుపల్లి పంచాయతీ, మద్దన్నగారిపల్లి గ్రామానికి చెందిన చినగాని నరసింహ యాదవ్‌కు చెందిన మామిడి తోటకు మంటలు వ్యాపించడంతో కొంత మేర మామిడి చెట్లు, పీవీసీ పైపులు, డ్రిప్ పైపులు, ఫెన్సింగ్ వైరు కాలిపోయాయి. దాదాపు రూ. రెండు లక్షలు నష్టం వాటిల్లినట్లు బాధితుడు శుక్రవారం పట్నం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. మామిడి తోటను తెలుగుదేశం పార్టీ రాష్ట్ర రైతు సంఘం కార్యదర్శి రమేష్‌బాబు, మండల కన్వీనర్ కరణం ప్రభాకర్, సిరిగారిపల్లి రవీంద్ర, పార్టీ నాయకులు, కార్యకర్తలు పరిశీలించారు.

వ్యవసాయ సామగ్రి దగ్ధం

ఓబుళదేవరచెరువు, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని వీరప్పగారిపల్లిలో రైతు డేరంగుల రామచంద్ర బోరు బావి వద్ద శుక్రవారం జరిగిన అగ్ని ప్రమాదంలో రూ. 70 వేలు విలువైన వ్యవసాయ సామగ్రి దగ్ధమయ్యాయి. బోరువద్ద గుర్తుతెలియని వ్యక్తులు అగ్ని పెట్టడంతో పైపులు, స్పింకర్లుతో పాటు వరిగడ్డి, ఉలవగడ్డి వాము ఆహుతయ్యాయి. ప్రభుత్వమే తనను ఆదుకోవాలని రామచంద్ర కోరారు.

కోళ్ల ఫాంను పరిశీలించిన పరిటాల శ్రీరామ్



నిర్మాణంలో ఉన్న కోళ్ల ఫాంను పరిశీలిస్తున్న పరిటాల శ్రీరామ్

బత్తలపల్లి ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం సమీపాన నిర్మాణంలో ఉన్న కోళ్ల ఫాంను టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ శుక్రవారం పరిశీలించారు. కోళ్ల ఫాం నిర్మాణం గురించి యజమాని మల్లికార్జునను అడిగి తెలుసుకున్నారు. అత్యాధునిక వసతులతో షెడ్లు నిర్మించడం వల్ల ఉష్ణోగ్రత, తేమశాతం, వెంటిలేషన్ తదితర వాటిని నియంత్రించవచ్చని తెలిపారు. దీని ద్వారా కోళ్ల ఎదుగుదల, ఉత్పత్తి పెరుగుతుందన్నారు.

దామోదరం సంజీవయ్యకు ఘన నివాళి

పుట్టపర్తిరూరల్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య జయంతి సందర్భంగా జిల్లా పోలీసు కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి శుక్రవారం నివాళులర్పించారు. ఎస్పీ వీరత్న మాట్లాడుతూ.. ప్రతిభకు కులం, మతం అడ్డుకాదని దామోదరం సంజీవయ్య నిరూపించారన్నారు. కార్యక్రమంలో ఎస్పీ సీఐ బాలసుబ్రమణ్యంరెడ్డి, ఆర్ఐలు మహమ్మద్‌వలి, మహేష్, ఆర్ఎస్సైలు పాల్గొన్నారు.

● బత్తలపల్లి :ఎంపీడీఓ కార్యాలయంలో దామోదరం సంజీవయ్య చిత్రపటం వద్ద ఎంపీడీఓ నరసింహనాయుడు, పరిపాలన అధికారి శ్రీనివాసులు, ఈఓఆర్డీ కిష్టప్ప, ఏపీఓ ఆదెప్ప నివాళులర్పించారు.



నివాళులు అర్పిస్తున్న ఎస్పీ వీరత్న

క్రైం న్యూస్..

ఉపాధ్యాయుడికి నోటీసులు



హెచ్‌ఎం నుంచి వివరాలు సేకరిస్తున్న ఎంఈఓలు

ధర్మవరంరూరల్, ఫిబ్రవరి14(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏలుకుంట్ల జిల్లాపరిషత్ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న చాణక్య అనే విద్యార్థిని ఆ పాఠశాల సైన్స్ ఉపాధ్యాయుడు జగన్నాథం కర్రతో గురువారం చితకబాదిన విషయం తెల్సిందే. దీనిపై విచారణ చేసిన నివేదిక ఇవ్వాలని జిల్లా ఉన్నతాధికారులు ఆదేశించారు. దీంతో ఎంఈఓలు గోపాల్‌నాయక్, రాజేశ్వరి శుక్రవారం ఆ పాఠశాలకు వెళ్లి విచారణ చేపట్టారు. ఆ పాఠశాల హెచ్‌ఎం హనుమంతరెడ్డి వద్ద వివరాలు సేకరించారు. సైన్స్ ఉపాధ్యాయుడు జగన్నాథం పాఠశాలకు రాకపోవడంతో వివరణ ఇవ్వాలని ఎంఈఓలు హెచ్‌ఎం ద్వారా నోటీసులు జారీచేశారు. విద్యార్థి చాణు క్యను పరామర్శించారు. దీనిపై జిల్లా ఉన్నతాధికారులకు నివేదిక ఇస్తామని, వారి ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని అన్నారు.

ఉపాధ్యాయుడిపై కేసు నమోదు

కదిరి, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): స్థానిక బండారు నగర్ కాలనీలోని కేఎల్ఎన్ ప్రైవేట్ పాఠశాలలో చదువుతున్న తమ కుమారుడు భానుతేజను అదే పాఠశాలలోని ఇంగ్లీష్ టీచర్ మధు కొట్టాడని నల్లగుట్టవీధికి చెందిన హరినాథ్, అశ్విని శుక్రవారం కదిరి టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఒక ప్రశ్నకు సమాధానం చెప్పకపోవడంతో ఆ టీచర్ కర్రతో కొట్టడంతో మోచేయి వద్ద ఎముక చిట్లిందని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో ఆ టీచర్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు.

చీటింగ్ కేసులో నిందితుడి అరెస్ట్

కదిరి, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): నకిలీ రిజిస్ట్రేషన్ పత్రాలు సృష్టించారని అంజాద్‌ఖాన్ అనే వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు పట్టణ సీఐ నారాయణరెడ్డి శుక్రవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. కదిరి పట్టణానికి చెందిన ఎద్దుల క్రిష్ణమూర్తి, అతని తమ్ముడు నాగరాజు 1991లో కదిరి మున్సిపాలిటీ పరిధిలోని సర్వే నెంబర్‌లో 1738-2లో ఉన్న 24 సెంట్లను కొన్నారు. వీరు పట్టణంలోని మచ్చా గంగులప్ప భార్య గంగులమ్మ, ఆమె కుమారై అంజనమ్మ నుంచి దాన్ని కొనుగోలు చేశారు. క్రిష్ణమూర్తి, నాగరాజు పేరున రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. అదే భూమిని జౌకపాళ్యం వీధిలో నివాసముంటూ రాయలసీమ సర్కిల్‌లో దుస్తుల దుకాణం నిర్వహిస్తున్న కౌలేపల్లి అంజాద్‌ఖాన్, అతని భార్య మున్వర్ హుస్నీషా, డాక్యుమెంట్‌రైటర్ జయక్రిష్ణయాదవ్‌తో కలిసి నకిలీ పత్రాలను సృష్టించారు. మచ్చా గంగులప్ప కుమారుడు వెంకట రమణ అనే వ్యక్తి నుంచి ఆ స్థలాన్ని కొన్నట్లు దొంగ విక్రయ అగ్రి మెంట్లు తయారు చేసి... అంజాద్, అతని భార్య పేరుపై రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. దీనిపై ఎద్దుల క్రిష్ణమూర్తి పోలీసులకు ఫిర్యాదు చేయగా అంజాద్‌ను పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి ఆరు నకిలీ రిజిస్ట్రేషన్ పత్రాలు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. కేసు దర్యాప్తులో ఉందని, డాక్యుమెంట్ రైటర్ జయక్రిష్ణయాదవ్‌ను అరెస్టు చేయాల్సి ఉందని అన్నారు.

దొంగకు జైలు శిక్ష

కొత్తచెరువు, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): ధర్మవరం మండలం ఉప్పునేశనపల్లికి చెందిన అమర్‌నాథ్‌నాయుడు 2019లో చోరీకి పాల్పడినందుకు పుట్టపర్తి కోర్టు మూడేళ్ల జైలు శిక్ష, రూ.500 జరిమానా విధించింది. అమర్‌నాథ్‌నాయుడుపై చాలా కేసులు ఉన్నాయి. 2019లో కొత్తచెరువు మండల కేంద్రంలో చేసిన చోరీ కేసులో ఆధారాలతో సీఐ శ్రీధర్, ఎస్ఐ లింగన్న అప్పట్లో కేసు నమోదు చేశారు. దీనిపై విచారణ అనంతరం న్యాయమూర్తి నిందితుడికి శిక్ష శుక్రవారం ఖరారు చేసినట్లు కోర్టు కానిస్టేబుల్ రవి తెలిపారు.

● తల్లిని చంపిన కేసులో.. : మండలంలోని లింగారెడ్డిపల్లి గ్రామానికి చెందిన అమర్‌దీప్ తల్లిపై దాడి చేయడంతో ఆమె చికిత్స పొందుతూ మృతిచెందింది. ఈ కేసులో నిందితుడు అమర్‌దీప్‌ను కొత్తచెరువులోని స్థానిక బస్టాండ్ సమీపంలో పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

రెండిళ్లలో చోరీ

బత్తలపల్లి ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): స్థానిక కోటి కాలనీలోని కోటి చంద్రమోహన్, కోటి నాగరాజు ఇళ్లల్లో శుక్రవారం చోరీ జరిగింది. వీ రు ఇళ్లకు తాళాలు వేసుకొని బంధువుల ఇళ్లకు వెళ్లారు. దుండ గు లు ఆ ఇళ్ల తాళాలు పగలగొట్టి.. చోరీకి పాల్పడ్డారు. సాయంత్రం ఇళ్లకు తిరిగి వచ్చిన వారు చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కోటి చంద్రమోహన్ ఇంటిలో ఒక బంగారు ఉంగరం, నాగరాజు ఇంటిలో ఒక బంగారు ఉంగరం, రూ.రెండు వేలు చోరీ అయినట్లు ఫిర్యాదు చేశారు.

పోలీస్ సిబ్బందికి శిక్షణ

పుట్టపర్తిరూరల్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): ప్రజలకు మెరుగైన సేవలం దించే కార్యక్రమంలో భాగంగా జిల్లా పోలీసు కార్యాలయం సిబ్బందికి ఈ ఆఫీస్ శిక్షణా తరగతులను ఎస్పీ వీరత్న శుక్రవారం ప్రారంభించారు. ఈ తరగతులకు డీపీఓ అధికారులు, జిల్లాలోని అన్ని పోలీసుస్టేషన్ల ఎస్‌హెచ్‌ఓలు హాజరయ్యారు.



ఆంజనేయుడికి ప్రత్యేక పూజలు

మడకశిర టౌన్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శివాపురంలో వెలిసిన వీరాంజనేయస్వామి ఆలయ మొదటి వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి పంచామృతాభిషేకం, ఆకుపూజ, పుష్ప అలంకరణ చేశారు. మహిళలు పెద్దసంఖ్యలో జ్యోతులను మోశారు.

ఘనంగా కలశ ప్రతిష్ఠాపన



కలశాన్ని ప్రతిష్ఠించిన దృశ్యం

పెనుకొండ, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో శిఖర కలశస్థాపన మహోత్సవాన్ని శుక్రవారం కమిటీ సభ్యులు ఘనంగా నిర్వహించారు. అర్చకులు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఉదయం గంగపూజ, గణపతి, వరుణపూజ, కళశస్థాపన అనంతరం మహామంగళహారతి, తీర్థప్రసాద వినియోగం చేశారు. మధ్యాహ్నం 12గంటలకు మహాపూర్ణాహుతి, హోమాలు నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు.

వేడుకగా ఆలయ వార్షికోత్సవం



గోరంట్ల, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పులేరు రోడ్డులో నూతనంగా నిర్మించిన రేణుకాయల్లమ్మ ఆలయ తొలి వార్షికోత్సవ వేడుకను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈడిగా గౌడ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో అమ్మవారిని అర్చకులు నాగేంద్రప్రసాద్ ప్రత్యేకంగా అలంకరించారు. హోమం, ప్రత్యేక పూజా కార్యక్రమాలు, మహా మంగళహారతి నిర్వహించారు. రాత్రి వెండిరథంపై అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఉంచి పట్టణ పురవీధుల్లో మంగళవాయిద్యాల నడుమ ఊరేగించారు. కార్యక్రమంలో ఈడిగ సంఘం నాయకులు గిరిధర్‌గౌడ్, రంగప్ప, శంకర్‌నారాయణ, వేణుగోపాల్, రామక్రిష్ణ, వెంకటేశ్వర్లు, నాగేంద్ర, శ్రీనివాసులు, లక్ష్మీనారాయణ, సాయి ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీమాతకు తమలపాకుల పూజ



రొళ్ల, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లినమడుగు గ్రామంలో వెలసిన లక్ష్మీమాతకు శుక్రవారం తమలపాకులతో పూజలు చేశారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో అగ్రహారం మాజీ ఎంపీటీసీ రాజన్న, దేవరాజు పాల్గొన్నారు.

శివస్వాములకు అన్నదానం

సోమందేపల్లి, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): శివమాలధారులకు శుక్రవారం హెల్త్ సూపర్‌వైజర్ రత్నమ్మ అన్నదాన కార్యక్రమం చేపట్టారు. శివానగర్, అయ్యప్పస్వామి ఆలయంలో కార్యక్రమాన్ని నిర్వహించారు.

వేసవిలో విద్యుత్ సమస్యలకు చెక్

- ప్రభుత్వ ఆదేశాలతో అప్రమత్తమైన అధికారులు
- నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు ప్రణాళికలు
- ఓవర్‌లోడ్ తగ్గించేందుకు ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు
- అవసరమైన చోట సబ్‌స్టేషన్ల నిర్మాణం



రైతులకు ట్రాన్స్‌ఫార్మర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ (ఫైల్)

హిందూపురం, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): వేసవిలో నిరంతరాయంగా విద్యుత్‌సరఫరా చేసేందుకు విద్యుత్‌శాఖ చర్యలు తీసుకుంటోంది. ఇందుకోసం యాక్షన్ ప్లాన్‌ను సిద్ధం చేసింది. వేసవిలో విద్యుత్ సరఫరాలో ఇబ్బందులతో ఇటు రైతులు, అటు వ్యాపారస్తులు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశించడంతో ఆ ఆదేశాల మేరకు ప్రణాళికలు రూపొందించారు. వీటిని పకడ్బందీగా అమలు చేసేందుకు అధికారులు గట్టి చర్యలు తీసుకుంటున్నారు. ఇటీవల జిల్లా ఉన్నతాధికారులు సంబంధిత మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించి వేసవి ప్రారంభం కాకనే ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని అవసరమైన చోట సబ్‌స్టేషన్ నిర్మాణం చేపట్టాలని ఆదేశించడంతో అధికారులు ఆదిశగా చర్యలు తీసుకున్నారు.

వైసీపీ హయాంలో మొండిచేయి

వైసీపీ హయాంలో కాళ్లరిగేలా కార్యాలయాల చుట్టూ రైతులు తిరిగారు. అయినా పలుకుబడి ఉన్నవారికి, వైసీపీ నాయకులకు మాత్రమే ట్రాన్స్‌ఫార్మర్లు దక్కాయి తప్ప రైతులకు అందలేదు. దీంతో చాలా మంది రైతులు బోర్లువేసి కూడా విద్యుత్ సరఫరా లేకపోవడంతో ఏళ్లతరబడి ట్రాన్స్‌ఫార్మర్ల కోసం ఎదురుచూశారు. దీనిని దృష్టిలో పెట్టుకుని కూటమి ప్రభుత్వం వచ్చాక ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంది.

పెరుగుతున్న కనెక్షన్లు

కొత్తగా ఇళ్లు నిర్మించుకున్నవారి సంఖ్య పెరుగుతుండటంతో కొత్త కనెక్షన్‌ల అవసరం ఏర్పడుతోంది. మరోవైపు వేసవి సమయంలో ఏసీ, కూలర్లు, ఫ్యాన్ల వాడకం కూడా పెరగనుంది. ఈ నేపథ్యంలో వేసవిలో విద్యుత్ వినియోగం పెరిగి లోవోల్టేజ్ సమస్య తలెత్తే అవకాశం ఉంది. అలాంటి పరిస్థితులు ఏయే ప్రాంతాల్లో ఉన్నాయో అధికారులు గుర్తించారు. పెరగబోయే విద్యుత్ అవసరాల డిమాండ్‌మేరకు కొత్తగా సబ్‌స్టేషన్ల నిర్మాణాలకు కూడా శ్రీకారం చుడుతున్నారు.

మూడు నియోజకవర్గాల్లో 300కుపైగా ట్రాన్స్‌ఫార్మర్ల పంపిణీ

ఇదిలా ఉంటే హిందూపురం నియోజకవర్గంతోపాటు మడకశిర, పెనుకొండ, హిందూపురం నియోజకవర్గాలలో ఇటీవల 300కుపైగా ట్రాన్స్‌ఫార్మర్‌లు రైతులకు అందించారు. హిందూపురం నియోజకవర్గంలో చిలమత్తూరు మండలానికి 64, లేపాక్షి 23, హిందూపురం మండలానికి 25 అందించారు. అదేవిధంగా పెనుకొండ నియోజకవర్గంలో పెనుకొండకు 63, పరిగి 20, గోరంట్ల మండలానికి 20, మడకశిర నియోజకవర్గానికి 90 అందించారు. అదేవిధంగా హిందూపురం పట్టణం, మండలానికి సంబంధించి నాలుగు విద్యుత్ సబ్‌స్టేషన్‌లు మంజూరయ్యాయి. ఇందులో మోతుకపల్లి, కిరికెర, గోళ్లాపురం సబ్‌స్టేషన్‌లకు భూమిపూజ చేయగా సింగిరెడ్డిపల్లి భూమి సేకరణలో ఉన్నారు. పెనుకొండ నియోజకవర్గంలో దొడగట్ట, పరిగి మండలం ఫైడేటి, మడకశిర నియోజకవర్గంలో పీసీవరం, కదిరేపల్లి, ఇనగలూరు విద్యుత్ సబ్‌స్టేషన్లు నిర్మాణం పూర్తికాగా మరో రెండు చోట్ల ఏర్పాటుకు నివేదికలు పంపారు.

ఓవర్‌లోడ్ తగ్గించడానికి..

ప్రస్తుత నిర్మాణానికి పూనుకున్న విద్యుత్ సబ్‌స్టేషన్‌లు పూర్తయి అందుబాటులోకి వస్తే ఓవర్‌లోడ్ తగ్గించడానికి ఆస్కారం ఉంటుంది. ముఖ్యంగా వేసవి ప్రారంభం కానుండటంతో లోవోల్టేజీ సమస్య తలెత్తకుండా, రైతులకు ఇబ్బంది లేకుండా విద్యుత్ సరఫరాను నిరంతరాయంగా చేయవచ్చు. ఈ మేరకు ప్రణాళికలను అధికారులు పక్కాగా సిద్ధం చేశారు. పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల్లో 1.92లక్షల ఇళ్లకు విద్యుత్ సర్వీసులున్నాయి. 42వేలు అగ్రికల్చర్, 12వేలు కమర్షియల్ సర్వీసులు ఉన్నాయి.

నాణ్యమైన విద్యుత్ సరఫరాకు ఆస్కారం

ఇళ్లకు, రైతులకు నాణ్యమైన విద్యుత్‌ను అందజేయడానికి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా ఇటీవల మూడు నియోజకవర్గాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లు రైతులకు ఇవ్వడం జరిగింది. అదేవిధంగా విద్యుత్ సబ్‌స్టేషన్ల నిర్మాణాలు కూడా జరుగుతున్నాయి. ఇవి పూర్తయితే నాణ్యమైన విద్యుత్ ఇవ్వడానికి ఎంతో ఆస్కారం ఉంటుంది.

- భూపతి, ఈఈ

ఘనంగా ఆంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవం

హిందూపురం అర్బన్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని దండురోడ్డులో వెలసిన 27 అడుగుల ఏకశిలా ఆంజనేయస్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అభిషేకాలు, అర్చనలు, హోమాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. జై శ్రీరాం, ఆంజనేయ నామస్మరణతో పరిసర ప్రాంతాలు మార్మోగాయి. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు కార్యక్రమంలో అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఆలయ కమిటీ సభ్యులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

మామిడి చెట్లకు నిప్పు

500 చెట్లు దగ్ధం



అగ్నికి ఆహుతైన మామిడి చెట్లు

లేపాక్షి, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పులమతి గ్రామానికి చెందిన ఆరు మంది రైతులకు సంబంధించి 500మామిడిచెట్లు శుక్రవారం అగ్నికి ఆహుతయ్యాయి. నారాయణప్ప, అంజినప్ప, నాగప్ప, గంగప్ప, నంజుండప్ప, పి. అంజినప్ప రైతులకు కోడిపల్లి వద్ద పది ఎకరాల పొలం ఉంది. అందులో 500మామిడిచెట్లు సాగుచేశారు. అయితే శుక్రవారం గుర్తుతెలియని వ్యక్తులు నిప్పుపెట్టడంతో పూర్తిగా దగ్ధమయ్యాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

బీసీ హాస్టల్ తనిఖీ

అగళి, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): బీసీ హాస్టల్‌ను మండల స్పెషల్ ఆఫీసర్ చంద్రశేఖర్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మౌలిక వసతులు ఎలా ఉన్నాయి..? మెనూ మేరకు భోజన వసతికి కావాల్సి సరుకుల వివరాలు.. నేమ్‌బోర్డులను పరిశీలించారు. రికార్డులను పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల విషయంలో జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. స్టోర్ రూమ్‌లో సరుకులను తనిఖీ చేశారు. ఆయన వెంట వార్డెన్ సికిందర్‌బాషా, సిబ్బంది రంగనాథ్, రఘు తదితరులు ఉన్నారు.

సమస్యల పరిష్కారం కోరుతూ 17న ధర్నా

సీఐటీయూ జిల్లా కార్యదర్శి

పెనుకొండ, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): అంగనవాడీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 17న ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్నట్లు సీఐటీయు జిల్లా కార్యదర్శి రమేష్, అంగనవాడీ కార్యకర్తలు సీడీపీఓ శాంతలక్ష్మీకు నోటీసులు అందజేశారు. అనంతరం రమేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చి ఎనిమిది నెలలు గడుస్తున్నా నేటికీ అంగనవాడీల సమస్యలు పట్టించుకోలేదన్నారు. ఈ నేపథ్యంలో ధర్నా నిర్వహించనున్నామన్నారు.

'రైతులు గుర్తింపు కార్డులు పొందాలి'

పెనుకొండ రూరల్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతు విశిష్ట గుర్తింపు కార్డు సంఖ్యను పొందాలని రొద్దం మండల వ్యవసాయాధికారి నివేదిత సూచించారు. స్థానిక రైతు భరోసా కేంద్రంలో రైతులకు ఈ గుర్తింపు కార్డు సంఖ్యను పొందడంవల్ల కలిగే ప్రయోజనాలపై శుక్రవారం ఆమె అవగాహన కల్పించారు. ప్రతి రైతు ఆధార్, పట్టాదారు పాసుపుస్తకం, మొబైల్ నంబరు తీసుకుని రైతు సేవాకేంద్రాలకు వెళ్తే అక్కడ రైతువిశిష్ట గుర్తింపు కార్డు నెంబరును కేటాయిస్తారన్నారు. ఈ కార్డుతో భవిష్యత్తులో ప్రయోజనాలు ఉంటాయన్నారు.

'సమస్యలను వెంటనే పరిష్కరించాలి'

పావగడ, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ కార్యదర్శుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని పలువురు డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారానికి రెవెన్యూ కార్యదర్శులు చేపట్టిన సమ్మె శుక్రవారం 4వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా పలుసంఘాల నాయకులు వారికి మద్దతు తెలిపి మాట్లాడారు. కనీస సౌకర్యాలను కల్పించాలని డిమాండ్ చేశారు. తమసమస్యలపై సమ్మెచేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడంలేదన్నారు. తమ సమ్మెకు రైతులు, పలు సంఘాలు మద్దతు తెలపడం హర్షణీయమని, వారికి కృతజ్ఞతలు తెలుపుతున్నామని రెవెన్యూ కార్యదర్శుల సంఘం అధ్యక్షుడు రాజేష్ అన్నారు.

ఇద్దరు దొంగల అరెస్ట్

పావగడ, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): ఇళ్లు, ఆలయాల్లో చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు దొంగలను తిరుమణి పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. గత నెలలో ఉప్పారహళ్ళితండా, కేతగానికెరె, రాయిచర్లు, పెండ్లిజీవి తదితర గ్రామాలలో వెండి, బంగారు, నగదును చోరీ చేసిన ఘటనల్లో నాగేష్ అలియాస్ నరసింహ, బొమ్మలాట మణికంఠను అరెస్ట్‌చేసినట్లు డీవైఎస్పీ మంజునాథ్ తెలిపారు. కృష్ణ, అంజిలను కూడా త్వరలో అరెస్టు చేస్తామని వెల్లడించారు. వారి నుంచి దాదాపు రూ. 4.5లక్షలు విలువచేసే బంగారు, వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేయడం జరిగిందన్నారు.

చురుగ్గా రీసర్వే

గుడిబండ, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగేపల్లి గ్రామంలో రీసర్వే వేగవంతం చేసి సకాలంలో పూర్తి చేస్తామని రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ రాంభూపాల్‌రెడ్డి తెలిపారు. కె.ఎన్.పల్లి సర్వే నెంబర్ 75 ఉండగా అందులో 404.12 విస్తీర్ణం ఉందని దీంతో సుమారు 270 ఎకరాల భూములను రీసర్వే చేశామని, గడువులోగా పూర్తి చేస్తామని తెలిపారు.

ఎన్‌ఎస్‌ఎస్ పీఓగా డాక్టర్ ప్రతాప్



పెనుకొండ, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): స్థానిక పరిటాల శ్రీరాములు ప్రభుత్వ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ పీఓగా చరిత్ర అధ్యాపకుడు డాక్టర్ ప్రతాప్‌ను నియమిస్తూ ఎస్కే యూనివర్సిటీ జాతీయ సేవాపథకం కోఆర్డినేటర్ మురళీధర్ ఆదేశాలు జారీచేశారు.

రేపు గిరి ప్రదక్షిణ

హిందూపురం అర్బన్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): గుడ్డం రంగనాథస్వామి ఆలయంలో ఆదివారం సాయంత్రం 6-45కు గిరి ప్రదక్షిణ నిర్వహిస్తున్నట్లు అర్చకులు గోవింద శర్మ, ఈఓ నాగేంద్రుడు తెలిపారు. ఈ సందర్భంగా మూలవిరాట్‌కు అభిషేకాలు ఉంటాయన్నారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక అలంకరణ ఉంటుందన్నారు. పల్లకిసేవలో భక్తులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

నేడు బాబా ఆలయంలో ప్రత్యేక పూజలు

సోమందేపల్లి, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని షిర్డీసాయిబాబా ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు సాయిసేవా సమితి సభ్యులు తెలిపారు. 12వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఉదయం నుంచి షిర్డీసాయిబాబాకు అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.

'మిత్ర యాప్‌ను సద్వినియోగం చేసుకోండి'

పెనుకొండ టౌన్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): మిత్రయాప్‌ను సద్వినియోగం చేసుకోవాలని టీడీపీ మండల కన్వీనర్ శ్రీరాములు సూచించారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో సెల్‌ఫోన్‌లో మిత్రయాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని యాప్‌పై అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్యూఆర్ కోడ్ డిజిటల్ రేషన్‌కార్డును ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం ఇవ్వనుందన్నారు.

హాస్టల్ వార్డన్‌పై విద్యార్థుల ఫిర్యాదు

గుడిబండ, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మందలపల్లి బీసీ హాస్టల్ వార్డన్ కేశవప్పపై విద్యార్థులు బీసీ వెల్ఫేర్ అధికారి గంగాధర్‌కు ఫిర్యాదు చేశారు. తమకు మెనూ ప్రకారం భోజనం అందించడంలేదని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. శుక్రవారం బీసీ వెల్ఫేర్ అధికారి గంగాధర్ హాస్టల్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సమస్యలను విద్యార్థులు ఆయనకు వివరించారు. హాస్టల్ సిబ్బంది తమపట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. దీంతో హాస్టల్‌వార్డన్‌పై బీసీ వెల్ఫేర్ అధికారి గంగాధర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మెనూ మేరకు విద్యార్థులకు భోజన సదుపాయం కల్పించకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యార్థులపట్ల నిర్లక్ష్యం వహించరాదన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పెనుకొండ రూరల్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): రొద్దం మండల విద్యుత్ ఉపకేంద్రంలో అత్యవసర మరమ్మతుల దృష్ట్యా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో అధికారులు తెలిపారు. రొద్దం, రెడ్డిపల్లి, పెద్దగువ్వలపల్లి, చిన్నగువ్వలపల్లి, వైటిరెడ్డిపల్లి, నారనాగేపల్లి, ఎం.కొత్తపల్లి, చిన్నమంతూరు, పెద్దకోడిపల్లి తదితర గ్రామాల్లో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు అంతరాయం ఉంటుందన్నారు.

బీజేపీలో చేరిక



పార్టీలోకి చేరిన వారితో మంత్రి సత్యకుమార్

గుడిబండ, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని శంకరగల్లు గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు నాగేంద్ర గుడిబండ గ్రామానికి చెందిన జి.బి.సుధాకర్ శుక్రవారం మంత్రి సత్యకుమార్ సమక్షంలో బీజేపీలోకి చేరారు. పార్టీ కండువాలు కప్పి వారిని పార్టీలోకి మంత్రి ఆహ్వానించారు. పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని ఈ సందర్భంగా మంత్రి వారికి సూచించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



అనిల్‌కుమార్ (ఫైల్)

హిందూపురం, ఫిబ్రవరి 14,(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతిచెందాడు. కారు, ద్విచక్రవాహనం ఢీకొన్న సంఘటనలో అనిల్ కుమార్ (29) మృతిచెందాడు. హిందూపురం దేవరపల్లికి చెందన రామాంజినప్ప కుమారుడు అనీల్‌కుమార్ కర్నాటక రాష్ట్రం దొడ్డబళ్లాపురలోని ఓ గార్మెంట్స్ పరిశ్రమలో పనిచేస్తున్నాడు. శుక్రవారం సాయంత్రం పని ముగించుకొని స్వగ్రామానికి వస్తుండగా తూమకుంట దాటాక ఎదురుగా వస్తున్న కారు ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ఈ ఘటనలో అనీల్‌కుమార్ అక్కడిక్కడే మృతి చెందాడు. అప్‌గ్రేడ్ పోలీస్ స్టేషన్ ఎస్‌ఐ మునిప్రతాప్ సంఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థులకు ఉచిత కంటి పరీక్షలు



పంపిణీ చేసిన కంటి అద్దాలతో విద్యార్థులు

మడకశిరటౌన్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం చేపట్టిన ఉచిత కంటి పరీక్షలు, అద్దాల పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం పట్టణ సమీపంలోని ఎంజేపీ గురుకుల బాలికల పాఠశాలలో నిర్వహించారు. డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ మంజువాణి ఆధ్వర్యంలో కంటి వైద్య అధికారి శ్రీనివాస్ విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. సమస్యలు ఉన్నవారికి ఉచితంగా కంటి అద్దాలను అందజేశారు. అనంతరం కంటి చూపునకు సంబంధించి విద్యార్థులకు పలు సూచనలు, సలహాలను డాక్టర్లు ఇచ్చారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ శృతి పాల్గొన్నారు.

పెనుకొండ, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): స్కూల్ చిల్డ్రన్స్ ఐ స్ర్కీనింగ్ ప్రోగ్రాం కింద శుక్రవారం విద్యార్థులకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి సమస్యలు ఉన్నవారికి అద్దాలను ఉచితంగా పంపిణీ చేశారు. స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నగర పంచాయతీ కమిషనర్ సతీష్‌కుమార్, ప్రభుత్వ ఆసుపత్రి నేత్ర వైద్యుడు శ్రీనివాసులు హాజరయ్యారు. విద్యార్థులు కంటి జాగ్రత్తలకు సంబంధించి వారు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో హెచ్‌ఎం జ్యోతిలత పాల్గొన్నారు.

గోరంట్ల, ఫిబ్రవరి14 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బాలికల ఉన్నతపాఠశాలలో దృష్టి లోపం ఉన్న 27మంది బాలికలకు శుక్రవారం అధికారులు కళ్లద్దాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మాధవీలత, ఆరోగ్య సిబ్బంది రమణ, మలేశ్వరీ, త్రిపుర, శ్రావణి, మంజుల, రత్నమ్మ, నాగలక్ష్మీ తదితరులున్నారు.

దామోదరం సంజీవయ్యకు ఘననివాళి



పెనుకొండలో సంజీవయ్య చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న బహుజన చైతన్య వేదిక సభ్యులు

పెనుకొండ, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): దామోదర సంజీవయ్య జయంతిని బహుజన చైతన్యవేదిక ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. బహుజన చైతన్యవేదిక అధ్యక్షుడు న్యాయవాది శివరామక్రిష్ణ ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్ సర్కిల్‌వద్ద సంజీవయ్య చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పేదలకోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపట్టారన్నారు. కార్యక్రమంలో రవికుమార్, బహుజన చైతన్యవేదిక సభ్యులు పాల్గొన్నారు.

గోరంట్ల: పట్టణంలోని మండలపరిషత్ కార్యాలయంలో శుక్రవారం దామోదరం సంజీవయ్య జయంతిని ఘనంగా నిర్వహించారు. పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నరేంద్రకుమార్, ఎఓ సూర్యనారాయణ, ఎపీఓ వరప్రసాద్, నవీన్, నీరంజన్, సతీష్ పాల్గొన్నారు.

హిందూపురం అర్బన్: ప్రజాసంక్షేమం కోసం నిరంతరం పరితపించిన నాయకుడు మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య అని ప్రజాసంఘాల నాయకులు కొనియాడారు. పట్టణంలోని ఎన్‌జీఓ హోంలో దామోదరం సంజీవయ్య జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగ సంఘం ఉమ్మడి జిల్లా నాయకులు జయరాం, హిందూపురం రిటైర్డ్ ఉద్యోగ సంఘం నాయకుడు ఓబులేసు, శ్రీనివాసులు నారాయన, రిటూర్డ్ డిటీ శివన్న, నిత్యానాథన్, ఆర్టీసి ఉద్యోగి శివప్ప, భైలప్ప, యూటీయూసీ నాయకుడు శ్రీనివాసులు ఉన్నారు.